# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక



సంపుటి: 27 సంచిక: 04 హైదరాబాద్ 2026 ఆగస్టు పేజీలు: 40

Please visit : www.srimeherbaba.com విడిప్రతి 20/-

# ఆరంగాంలో అవతారుని కేంద్రం - భూమిపూజ

వార్తా వ్యాఖ్య పేజి 25లో











ఫోటోలు - శ్రీ జల్లు వెంకట్ మెహెర్, మెహెరాబాద్

## బాబావారికి దగ్గరగానా? దూరంగానా? అన్నది అప్రస్తుతం

ప్రాక్‌పశ్చిమ సమావేశ సమయంలో బాబా ప్రేమికుడొకరు మెహెరాబాద్‌లో శాశ్వతంగా ఉండిపోవాలనుకున్నాడు. అందుకు బాబా ఇలా అన్నారు, "నీవు నా దగ్గర ఉన్నావా? లేక నాకు దూరంగా వుంటున్నావా? అన్నది ప్రధానం కాదు. నన్ను అమితంగా ప్రేమిస్తూ, నా నామస్మరణ చేస్తూ, నేను మానవరూపధారిగా వచ్చిన భగవంతుడిని, అని గుర్తెరగడం ముఖ్యం అన్నారు. మీరు నాకు దగ్గరగా ఉండటం కంటే దూరంగాఉండటమే మేలన్నారు. నాకు దగ్గరగా ఉండటం వల్ల శాంతి లభించదు. అశాంతిని చవిచూస్తారని హెచ్చరించారు.

**గౌరవ సంపాదకులు:**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**శ్రీ దశిక ప్రసాదరావు**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. కల్నల్ యం.యస్.ఇరానీ 6-9
3. సిద్ధూ దౌలత్ కాంబ్లే 10-14
4. నెమరు 15-18
5. ఆరంగాంలో బాబా కేంద్రం 19
6. లార్డ్ మెహెర్ 20-24
7. ట్రస్టుకి మంచి రోజులు 25-27
8. జియస్‌యన్ మూర్తి 28-31
9. కోఠి కేంద్ర వార్షికోత్సవం 32
10. ఖేద్గాం మహారాజ్ 33-34
11. మా మాటలు 35-39
12. జీవితసభ్యులు 40

**ముఖ చిత్రం**
**పసుపు రంగు పూలు - ప్రశాంత వాతావరణం**
**ఎగువ మెహెరాబాద్**

### మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవల్సింది. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 26న హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం.**

# చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం

## 2026 ఆగస్టు 29, 30 తేదీలలో

**చల్లపల్లి బాబా కేంద్ర 61వ వార్షికోత్సవం రెండ్రోజులపాటు 2026 ఆగస్టు 29, 30** తేదీలలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శ్రీ చుండూరి మెహెర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆగస్టు 29వ తేది సాయంత్రం 4 నుండి ఆగస్టు 30 సాయంత్రం 4 వరకూ ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ చుండూరి తెలిపారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. ప్రేమికుల తమ రాకపోకల వివరాలను ఫోన్ నంబర్లు 94401 12351 / 83281 04197 /96862 61302 / 99636 58859 తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.

# మనోనాశ్ -అమృతోత్సవాలు

**అవతారుడు మనోనాశ్ కార్యక్రమం చేపట్టి 2026 అక్టోబరు నాటికి 75 సంవత్సరాలు నిండుతున్నాయి.** 1949 అక్టోబర్ 16న బాబా నవజీవనం ప్రారంభించిన విషయం పాఠకులకు తెలుసు. నవజీవనానికి ముగింపుగా 1951 అక్టోబరు 16 నుండి 23 దాకా ఖాజాగూడ కొండపై వున్న చిన్న గుహలో మెహెర్‌బాబా **మనోనాశ్** కార్యక్రమాన్ని నిర్వహించారు. 1951 అక్టోబరు 24న హైదరాబాద్ నుండి కాలినడకన మెహెరాబాద్‌కి బయల్దేరారు. ఈ సందర్భంగా, హైదరాబాద్‌లో రెండు రోజుల మనోనాశ్ అమృతోత్సవ వేడుకలు 2026 అక్టోబరు 17న జూబ్లి బాబా కేంద్రంలో, అక్టోబరు 18న మనోనాశ్ గుహ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన వల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. దూరప్రాంతాల నుండి విచ్చేయు వారికి తగిన వసతి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సప్ నంబర్లు - 9849046848, 9652422599, 9396702076, 924652609 సంప్రదించగలరు. **అందరూ ఆహ్వానితులే.**

# మెహెర్‌బాబా పత్రిక కోసం

మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ కోసం **2026** ఆగస్టు నెలలలో

**1. శ్రీమతి పావని, విశాఖపట్నం రూ. 1000/- 2) శ్రీ బెహెరా వెంకట్రావ్, పార్వతీపురం రూ. 1000/-, 3) శ్రీ కాశీనాథ్ పవార్, నిజామాబాద్ రూ. 1000/-, 4) బాబా ప్రేమికులు తమ పేరు ప్రచురించవద్దన్నారు. రూ. 1000/- 5) శ్రీమతి దీప్తి శాంత, విశాఖపట్నం. 1000/- పంపినారు. వీరందరికి పత్రిక పక్షాన ధన్యవాదములు, జైబాబా.**

సంపాదకీయం

# ఏరుచ్ ఏ'రుచి' గనెనో

## 2026 ఆగస్టు 31 – స్మరణీయమైన రోజు



**నేను వ్యక్తిగతంగా ఎప్పుడైనా, ఎవరితోనైనా కొంతసేపు** గడపాలని భావిస్తే, అది ఏరుచ్‌తోనే అని మెహెర్‌బాబా ఒక సందర్భంలో అన్నారు. ఆస్ట్రేలియన్ కవి పండితుడైన ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ఏరుచ్‌ని "భగవంతుని స్వరం" (టంగ్ ఆఫ్ ది గాడ్) అని అభివర్ణించాడు.

**అవతారుని పిలుపు అందుకుని, 1938 మే నెలలో 21** సంవత్సరాల వయస్సులో ఏరుచ్ మెహెరుని సేవకు తన జీవితాన్ని అంకితమిచ్చాడు. బాబాతో కలిసి దేశ, విదేశాలలో విస్తృతంగా పర్యటించాడు. 'భగవంతుని స్వరంగా' కీర్తిగడించిన ఏరుచ్ స్వరం 2001 ఆగస్టు 30 అర్థరాత్రి 2 గంటలు దాటాక మూగవోయింది.

**ఏరుచ్ సున్నితమైన హాస్యంతో మనస్సు గిలిగింతలు పెట్టేలా మాట్లాడేవాడు. చక్కని చమత్కారి,** మృధుభాషి, 'బాబా సేవకుడిని అని చెప్పుకునే ఏరుచ్', బాబా ప్రేమికుల్ని, చిన్నా పెద్దా అందర్నీ ఎంతో ప్రేమతో ఆప్యాయతతో పలకరించేవాడు. ఒకసారి ఆయనతో మాట్లాడిన వారు తిరిగి ఎన్ని సంవత్సరాలైన మరచిపోలేనటువంటి వ్యక్తిత్వం ఏరుచ్‌ది. అసమాన్య ప్రతిభావంతుడు.

**1969 జనవరి 31న బాబా భౌతిక శరీర త్యాగం చేశాక, బాబా ప్రేమికులందరికి ఏరుచ్‌తో** తమ స్నేహం మరింత బలపడింది. అవతారుని సందేశాలపై, తన అనుభవాలను జోడించి కడు చమత్కారంగా వివరించి చెప్పేవాడు ఏరుచ్. ఈ సరస సంభాషణలో కూడా ఏరుచ్‌కి తనదైన ఒక ప్రత్యేక శైలి వుంది. ఆబాలగోపాలం ఏరుచ్ మాటలు వినడానికి ఎంతగానో ఇష్టపడేవారు. చాలామంది బాబా ప్రేమికుల దగ్గర ఏరుచ్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను బద్రంగా దాచుకున్నారు. ఎవరికి, ఎప్పుడు, ఎలాంటి సందేహం వచ్చినా ఓ పోస్టుకార్డు రాస్తే, పెద్దన్న గారిలా వారి సందేహాలకు సరైన జవాబిచ్చేవాడాయన. **అవతారుని** సమక్షంలో జరిగిన ఎన్నో సంఘటనలకు ప్రత్యక్ష సాక్షి ఏరుచ్. మెహెర్‌బాబా వారి సందేశాలను ఆచరణలో అమలుచేసి, అవి ఆచరణలో అసాధ్యం కాదని రుజువు చేసిన ధన్యుడు ఏరుచ్

**ఆ మహనీయుడ్ని ప్రతి బాబా కేంద్రంలో ఆగస్టు 31న కొన్ని క్షణాలు స్మరించుకుందాం!**

విలక్షణ ఆధ్యాత్మిక ప్రయాణం - మెమోరియల్ టవర్‌లో స్థానం కల్పించిన అవతారుడు

# కల్నల్ యం.యస్. ఇరానీ

## (1878 నవంబరు - 1960 జనవరి 10)



**మేర్వాన్ సోహరాబ్ ఇరానీ "నా రావణుడు" అని మెహెర్‌బాబా ప్రకటించారు. క్లుప్తంగా యం. యస్. ఇరానీ అని** బాబా ప్రేమికులందరికి ఆయన సుపరిచితుడు. ఆర్మీలో కల్నల్ హోదాలో పనిచేసి పదవీ విరమణ చేశాడు. మెహెరా మాయికి స్వయానా మేనమామ. మెహెరా తల్లి దౌలత్‌కు చిన్న తమ్ముడు. మెహెరా తండ్రి స్వర్గస్తుడయ్యాక తన అక్క, ఆమె కూతుర్ని మెహెరాశ్రమం వదిలి తనతో వచ్చి పూణేలో వుండమని కోరాడు. **ఐతే, వారు మెహెరాశ్రమం వదిలి రాలేమని కచ్చితంగా చెప్పడంతో కల్నల్ గారు మెహెర్‌బాబాపై ద్వేషం పెంచుకొన్నాడు. శ్రీరాముడిపై రావణాసురుడిలా, బాబావారిపై** విరోధ భావం పెంచుకొన్నాడు. మెహెర్‌బాబాని తీవ్రంగా విమర్శిస్తూ పత్రికల్లో వ్యాసాలు వ్రాసాడు. 1925వ సంవత్సరం నుండి బాబాపై దుష్ప్రచార యుద్ధం ప్రకటించాడు. ఈ యుద్ధాన్ని సుమారు 35 ఏళ్ళపాటు అంటే 1960 జనవరి 10న ఆయన తుదిశ్వాస వదిలే వరకూ కొనసాగించాడు.

**తీవ్ర విరోధి కల్నల్ మరణానంతరం, ఆయన పేరును మెహెరాబాద్‌లో నిర్మించబోయే** స్మారక స్థూపంలో లిఖించమని బాబా తన మండలిని ఆదేశించారు. **ఆశ్చర్యం కదూ!** బాబా సేవ – ప్రేమలో తరించి తనువు చాలించిన ప్రేమికుల కోసం ఈ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్న తరుణంలో, వారందరి సరసన కల్నల్ గారి పేరుని చేర్చమన్నారు బాబా. ఆసక్తికలిగించే ఈ సమాచారాన్ని ఈ శీర్షికలో చదువుకుందాం!




## యం.యస్. ఇరానీ గురించి క్లుప్తంగా

**కల్నల్ యం.యస్.ఇరానీ, పూణే నివాసి. బ్రిటిష్ సైన్యంలో ఉన్నత పదవిలో పనిచేశాడు.** శ్రీమంతుల కుటుంబ నేపథ్యం. ఇంతకీ ఈయన ఎవరో కాదు. అవతారుడ్ని ప్రేమించ వల్సిన రీతిలో ప్రేమించిన ప్రప్రథమ బాబా స్త్రీ మండలి సభ్యురాలైన మెహెరా మాయికి స్వయానా మేనమామ. మెహెరా మాయి తల్లి - దౌలత్‌కు రక్తం పంచుకుని పుట్టిన ఏకైక తమ్ముడు. దౌలత్ మాయి, ఆమె కుమార్తె మెహెరా, వీరిద్దరూ మెహెరాబాద్ ఆశ్రమంలో ఉండటం కల్నల్‌జీకి సుతరామూ ఇష్టం లేదు. ఆనాడు మెహెరాబాద్ అంటే ఒక నిర్జన అరణ్యంలా వుండేది. ఎలాంటి సౌకర్యాలు లేని ఎడారి ప్రాంతం. అటువంటి చోట తన సోదరి, మేనకోడలు పడరాని కష్టాలు అనుభవిస్తున్నారని కల్నల్ బాధపడేవాడు. మెహెరాబాద్ ఆశ్రమం వదిలి తనతో పూణేకి రమ్మనమని శతవిధాల ప్రయత్నించాడు. ఎంతగానో నచ్చచెప్పాడు. మెహెర్‌బాబాని ఒక దొంగ గురువుగా సంబోదిస్తూ, తనతో పూణేకి వచ్చి సాధారణ ప్రాపంచిక జీవితాన్ని గడపమని ఒత్తిడి చేశాడు. కానీ దౌలత్ - మెహెరాలు ఇద్దరూ కల్నల్ మాటల్ని ఖాతరు చేయలేదు. మెహెరాశ్రమంలో తమకు దైవ సన్నిధి చిక్కిందన్నారు. తాము తృప్తిగా వున్నామని సున్నితంగా కల్నల్ మాటని తిరస్కరించారు.

**అధికారం, ఆర్థిక బలం వున్న కల్నల్ గారికి ఇది నచ్చలేదు. మెహెర్‌బాబా చేసిన మోసంలో తన** చెల్లెలు, ఆమె కూతురు చిక్కుకున్నారని, కల్నల్ మెహెర్‌బాబాకు తీవ్ర వ్యతిరేకిగా మారాడు. తన అధికార దర్పంతో, బాబా చేసే పనులకు అనేక ఆటంకాలు సృష్టించే ప్రయత్నం చేశాడు. కల్నల్ గారు మెహెర్‌బాబాపై పగ - కక్ష పెంచుకున్నాడు. తదాదిగా రమారమి మూడున్నర దశాబ్దాలకు పైగా అవిశ్రాంతంగా అవతారుడిపై విషం గక్కాడు.

## వ్యతిరేకత - విశ్వ కార్యానికి ఒక సాధనం

**ఐతే, ఆ వ్యతిరేకత బాబా యొక్క అంతరంగ కార్యక్రమానికి ఒక సాధనంగా** ఉపయోగపడింది. కల్నల్‌జీ పలు వారపత్రికలలో శత్రుత్వంతో కూడిన విమర్శనాత్మక వ్యాస రచనలు ప్రచురించాడు. ఇవన్నీ బాబా గురించి మరింత సమాచారం తెలుసుకోవాలనే ఉత్సుకత రేకెత్తించింది. అలాంటివారు స్వయంగా బాబాను దర్శించు కునేలా ప్రేరేపించింది. బాబా దర్శనం చేసుకున్నవారికి కల్నల్ ప్రచారంలో నిజమెంతో తెలిసి వచ్చింది. చాలా మంది బాబావారి ప్రేమపూర్వక మధుర్యాన్ని చవిచూశారు. ఆ పిదప ఎందరో బాబాకు అత్యంత సన్నిహితులయ్యారు. ఈ కోణంలో చూస్తే, కల్నల్ ఇరానీ తనకు తెలియకుండానే బాబాకు అపారమైన సేవ చేశాడు.

**కల్నల్ గురించి బాబా ఇలా అన్నారు, "కల్నల్ నన్ను ఎలాగోలా గుర్తుంచుకుంటున్నందుకు** అతను అదృష్టవంతుడు. నా పట్ల ఆయనకు నిజంగా ఎలాంటి భావన ఉందో మీకు తెలియదు. తన విశ్వకార్యక్రమానికి కల్నల్ ఇరానీ అంతర్గతంగా ఎంతగానో సహాయం చేస్తున్నాడు. మీరు అతగాడ్ని విమర్శించ వద్దు. అతను ప్రవర్తించినట్లు మీరు ప్రవర్తించవద్దని హెచ్చరించారు బాబా తన మండలిని.

## అందరిలో ఉన్న ఆత్మ ఒక్కటే

**కల్నల్ నాకు సన్నిహిత స్నేహితుడు. కల్నల్ కూడా నా వాడే. నా స్నేహితుల్లో - శత్రువుల్లో** వున్నది ఒకే ఒక్క ఆత్మ. అందరిలో ఉన్నది ఒకే ఒక్క ఆత్మ కదా. ఒక వ్యక్తి తన చేత్తో తన చెంపను మెల్లగా రాసుకున్నా లేదా గట్టిగా కొట్టుకున్నా, అతను తన చేతిపై కోపగించుకుంటాడా? అని ప్రశ్నించారు. ఎందుకంటే చేతితో నెమ్మదిగా నిమిరినా, గట్టిగా కొట్టుకున్నా , అది తన హస్తమే కదా అన్నారు. అందరూ నా వాళ్ళే. అందరూ నాకు సమానం. దేవుడు అందరిలోనూ ఉన్నాడు. ఎవరిదీ తప్పు లేదని, బాబా హెచ్చరించారు.

**కల్నల్‌జీ 1960 జనవరి 10న మరణించాడు. ఆ పిదప, కల్నల్ ఇరానీ పేరును** మెహెరాబాద్‌లో నిర్మించనున్న మెమోరియల్ టవర్‌లో లిఖించమని బాబా తన మండలిని ఆదేశించారు. భగవంతుడి దృష్టిలో అందరూ సమానమే. ఆయనికి శత్రువులు, మిత్రులు అంటూ ఎవరూ వుండరని బాబా ఆచరణాత్మకంగా ప్రభోదించారు. అందరిలోనూ దైవాన్ని దర్శించడమే నిజమైన ఆధ్యాత్మికత అన్నారు బాబా. నేడు ఈ స్థూపంలో మొత్తం 355 ప్రేమికుల పేర్లు లిఖించారు. ఆ జాబితాలో కల్నల్ యం.యస్.ఇరానీ పేరు క్రమ సంఖ్య 100లో కనిపిస్తుంది. **ఈ విషయమై అవతారుని సన్నిహిత మండలి సభ్యుడైన భావూజీ అంతరంగం ఇలా వుంది. ప్రక్కపేజీలలో తెలుసుకుందాం!.**

# భావూజీ అంతరంగం

**2001 డిసెంబర్ 12.**

ఆ రోజు మాటల సందర్భంలో కల్నల్ ఎం. ఎస్. ఇరాని ప్రస్తావన వచ్చింది. ఆ సందర్భంలో బాబావారి మాటలు గుర్తుచేసుకున్నాం. అదేమంటే 'ఈ అవతారకాలంలో నాకు పన్నెండు మంది జూడాస్‌లు (వ్యతిరేకులు) ఉంటారని బాబా అన్నారు. ఆ పన్నెండు మంది ఎవరో బాబా వివరంగా చెప్పలేదు కానీ, ఆ 12 మందిలో కల్నల్ ఎమ్.ఎస్. ఇరానీ ప్రప్రథముడు అని స్పష్టంగా చెప్పొచ్చు. **"ఈతను నా రావణుడు" అని బాబా అన్నారు.** కల్నల్ ఇరానీ బాబాను తీవ్రంగా వ్యతిరేకించాడు. పార్శీయుల్ని బాబాకు వ్యతిరేకంగా మార్చడానికి అతను ఎన్నో విధాల ప్రయత్నించాడు.

**1939లో బెంగళూరుకు సమీపంలోని 'భైరమంగళ విశ్వ ఆధ్యాత్మిక కేంద్ర' భూమిపూజ** సమయంలో, పూణే నుండి పనిగట్టుకుని మరీ బెంగళూరుకు వచ్చి, **"మోసకారి మెహెర్‌బాబా" (MEHER BABA, THE HOAX)** అనే పేరుతో ఒక ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించాడు. వేలాది పుస్తకాలను బెంగళూరులో ఉచితంగా పంపిణీ చేశాడు. బెంగళూరులో పలుచోట్ల బాబాకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు కూడా ఏర్పాటు చేశాడు. ఆనాటి ప్రముఖుల్ని ఆ వేదికపైకి ఆహ్వానించాడు. కల్నల్‌కి రేయింబగళ్లు బాబాకు వ్యతిరేకంగా పనిచేయడం మినహా మరో ఆలోచన ఉండేది కాదు. అదే ఆయన ప్రధాన వ్యాపకం. అవిశ్రాంతంగా అవతారుడ్ని అనేక విధాల వ్యతిరేకరించిన ఘనత కల్నల్ ఇరానీకి దక్కుతుంది. కల్నల్ ఇరానీ ఎంత ఎక్కువ వ్యతిరేకతను సృష్టించాడో, అంత ఎక్కువ మందికి ప్రియతమ బాబా గురించి తెలిసింది. ఏసుక్రీస్తుకి జూడాస్ ద్రోహం చేసినట్లు, అవతారుడిని అడుగడుగునా వ్యతిరేకరించాడు కల్నల్ ఇరానీ.

ప్రతీది **దైవేచ్ఛ (Divine Will)** ప్రకారమే జరుగుతుంది. ఆ విధంగా కల్నల్ ఇరానీ చేసినదంతా కూడా దైవేచ్ఛ పరిధిలోనే జరిగింది. ఆయన ప్రియతమ బాబాను ఎంతగా వ్యతిరేకించినప్పటికీ, ఆయన బాబా నామాన్ని నిరంతరం స్మరిస్తూనే ఉన్నాడు. బాబాను వ్యతిరేకించినా, ఆయన ప్రియతమ బాబా బిడ్డే అన్నారు బాబా. అందుకే ప్రియతమ బాబా ప్రేమ–సేవలో తరించి తనువు చాలించిన వారి జాబితాలో కల్నల్ ఇరానీ పేరుకి మెమోరియల్ టవర్'లో స్థానం కల్పించారు. **అంతేకాదు, కల్నల్‌జీ ఎంతగా బాబావారిని వ్యతిరేకరించినా, నిరంతరం బాబా నామస్మరణలో, బాబా ఆలోచనలతో వుండటం వల్ల, కల్నల్ గారి తదుపరి జన్మలో మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితమైన కుటుంబంలో జన్మిస్తాడని బాబా ప్రకటించారు. ధన్యుడు కదండీ!**

## అవతారుని ప్రశంశలు అందుకున్న

# సిద్ధూ దౌలత్ కాంబ్లే



**ఆ వేళ 1924వ** సంవత్సరం మే మాసం. **సిద్ధూ దౌలత్ కాంబ్లే (23) ఆరంగాం నివాసి.** ఉద్యోగాన్వేషణలో వున్నాడు. తమ గ్రామానికి ఎవరో 'ఒక పెద్దాయన' వచ్చాడని తెలిసి ఆయన్ని దర్శించు కుందామని మెహెరాబాద్‌కి వచ్చాడు. ఆ సమయంలో బాబా తన మండలి వారితో కలిసి పోస్టాఫీసుకు దగ్గరలో క్రికెట్ ఆడుతున్నారు. సిద్ధూ ఆ ఆటని చూస్తూ రోడ్డుకి ఆవలగా కూర్చున్నాడు.

**కొద్దిసేపటి తర్వాత బాబా సిద్ధూని తన** వద్దకు రమ్మనమని ప్రేమగా పిలిచారు. నీ పేరేమిటి ? మీ ఇల్లు ఎక్కడ? ఏం చేస్తుంటావ్? అని యోగక్షేమాలు అడిగారు. ప్రస్తుతం తానేమీ చేయడం లేదన్నాడు సిద్ధూ. ఉద్యోగం కోసం వెదుకులాటలో వున్నానన్నాడు. ఎంతవరకూ చదువుకున్నావ్? అని అడిగారు. స్థానిక మరాఠీ స్కూల్లో మూడవ తరగతి వరకూ చదివాను అని జవాబిచ్చాడు. బొంబాయిలో నీకేమైనా ఉద్యోగం ఇప్పిస్తే అక్కడకి వెళ్తావా? అని బాబా అడిగారు. తప్పకుండా అన్నాడు సిద్ధూ. ఆ తర్వాత బాబా సిద్ధూని భోజనం చేద్దువుగాని రమ్మనమన్నారు. వద్దు బాబా అని, వినయంగా అన్నాడు సిద్ధు. లేదు, ప్లేటు పట్టుకు రమ్మనమని బాబా ఆదేశించారు. దాంతో తన ప్లేటు నిండా భోజనం పెట్టుకుని తృప్తిగా తిని వెనుతిరిగాడు సిద్ధూ. ఏమాత్రం పరిచయం లేనివాడినైనా, బాబా తననెంతో ప్రేమగా చూసుకున్నారని, కడుపారా భోజనం పెట్టి పంపుతున్నారని మనస్సులో ఎంతో సంతోషించాడు సిద్ధూ.

**బాబావారన్న మాట ప్రకారం ముంబాయిలో సిద్ధూకి ఒక ఉద్యోగం ఇప్పించారు. ఏడాదిపాటు** అక్కడే వుండు. ఏడాది అయ్యే వరకూ తన దర్శనార్థం రావద్దని హెచ్చరించారు. ఐతే, ముంబాయిలో వున్న రోజుల్లో 'టిప్పు బాబా'ని తరచు దర్శించమని బాబా సూచించారు.

## మెహెరాశ్రమంలో సిద్దూ

**టిప్పు బాబా ఒక సాధువు. అతను ముంబాయికి నా చార్జిమెన్ అని బాబా ప్రకటించారు.** ఏడాది కాలం పూర్తయ్యాక, బాబా ఆదేశాల మేరకు 1925 ఏప్రిల్ చివరిలో సిద్దూ మెహెరాబాద్‌కి వచ్చాడు. బాబాని దర్శించుకున్నాడు. అ పిదప, ఇకపై ఏం చేయాలనుకుంటున్నావ్? అని బాబా అడిగారు. నీవు ఏది చెపితే అది చేస్తాను బాబా అన్నాడు సిద్దూ విధేయతతో. మెహెరాశ్రమంలో నీకు పని ఇస్తానన్నారు బాబా. ఐతే, నాకు ఇది కావాలి లేదా అది కావాలని నన్ను అడగరాదన్నారు. జీతం ఇంత కావాలి అని అడగరాదన్నారు. నీకు అవసరమైనది నేను తప్పక సమకూరుస్తానన్నారు. ఈ నిబంధనలకు నీవు ఒప్పుకుంటే, నీకు కొన్ని పనులు అప్పగిస్తానన్నారు. బాబావారి ఆదేశాల్ని తు.చ తప్పక పాటిస్తానని సిద్దూ అంగీకరించిన పిదప, ఇక్కడున్న పాయఖానాలు కూడా శుభ్రపరచ గలవా? అని బాబా అతగాడిని అడిగారు. ఐతే అందుకతను సంశయిస్తుంటే, ఫరవాలేదులే, అన్నారు నవ్వుతూ.

**ఆ తర్వాత మెహెరాబాద్‌లో ఆనాడు నిర్వహిస్తున్న ఆసుపత్రికి బాబా వెళ్ళారు. బాబా వెంట** సిద్దూ కూడా వున్నాడు. ఆసుపత్రిలోకి అడుగు పెడుతూనే ఒక రోగి మంచం దగ్గరకు వెళ్ళారు. అతను తన మంచంలోనే మల మూత్ర విసర్జన చేసి పడుకుని ఉన్నాడు. బాబా అతడ్ని చూసి, మంచంపై వున్న పక్క మార్చి ఆ రోగిని శుభ్రపరిచారు. సిద్దూ కేసి చూస్తూ, రోగులు ఎవరైనా ఈ మాదిరిగా తమ పరిసరాలు పాడుచేస్తే, వాటిని నేను శుభ్రపరుస్తానులే. నిన్ను ఇబ్బంది పెట్టను అన్నారు. బాబా మాటలతో గొప్ప షాక్‌కి గురయ్యాడు సిద్దు. బాబావారి మాటలు సూదంటు రాయిలా గుచ్చుకున్నాయి సిద్దూకి. మెహెర్‌బాబా అంతటివాడు రోగులను పరిశుభ్రంగా ఉంచేందుకు కష్టపడుతుంటే, నేనెంతటి వాడిని అనుకున్నాడు. నేను కూడా ఆ పనిని చేయగలననుకున్నాడు.

## 1930 నుండి మహమ్మద్ మస్తుతో సిద్దు

**కొద్దిరోజులు పోయాక సిద్దూని బాబా తన మండలి సభ్యునిగా చేర్చుకున్నారు. మెహెరాబాద్‌లోని** ఆసుపత్రిని, అక్కడ వైద్యం తీసుకుంటున్న రోగుల్ని పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అప్పగించారు. మెహెరాబాద్‌కు ప్రప్రథమంగా వచ్చిన మస్తు పేరు మస్తాన్. అతను 1925 నుండి బాబా దగ్గర మెహెరాబాద్‌లో వున్నాడు. బాబా బృందం మెహెరాబాద్‌కి రాగానే ముందుగా మస్తాన్‌కి ప్రేమతో ఆలింగనం ఇచ్చారు. ఇతను ఈ ప్రపంచంతో సంబంధం లేకుండా ఒంటరిగా వున్నా నిరంతరం భగవత్ప్రేమలో మునిగి వుంటాడని బాబా అన్నారు. సిద్దూకి అతడి అవసరాలు చూసుకునే బాధ్యతను 1930 నుండి అప్పగించారు.



**ఒకరోజున మండు వేసవిలో ఎగువ మెహెరాబాద్** కొండకు బాబా తన మండలితో కలిసి వెళ్ళారు. ఈ రోజు ఎండ చాలా ఎక్కువగా వుంది.

ఐనప్పటికీ నా పని పూర్తికావడం కోసం ఇక్కడకు తప్పక రావల్సి వచ్చిందన్నారు బాబా. ఇదిఇలా ఉంటే సిద్దు ఏం చేసాడను కున్నారు. చల్లని నీళ్ళలో ముంచిన దోమ తెరనొకదాన్ని తీసుకొచ్చి, ఆ దోమతెర నీడలో నడిచే ఏర్పాటు చేశాడు. దీనివల్ల బాబావారికి బయటవున్న ఎండ తీవ్రత కొంతమేర తగ్గినట్లయ్యింది. బాబా సంతోషించారు.

## అవిధేయత పట్ల ఆగ్రహం

**ఆ పిదప, సిద్దూని అహమ్మద్‌నగర్‌కి వెళ్ళి, ఆ రోజు వచ్చిన తపాలా, టెలిగ్రాంలు వగైరా** వుంటే తీసుకు రమ్మనమన్నారు. ఆ రోజుల్లో బాబావారికి వచ్చే టపా అంతా అక్బర్ ప్రెస్, అహమ్మద్‌నగర్ అడ్రస్సుకు వచ్చేవి. ప్రతిరోజూ మెహెరాబాద్ నుండి ఎవరైనా ఒకరు వెళ్ళి ఆ ఉత్తరాలను తీసుకు వస్తుండేవారు. ఐతే, ఆ రోజున బయట ఎండ తీవ్రంగా ఉంది కాబట్టి, కాస్త చల్లబడ్డాక బాబా చెప్పిన పని చేద్దామనుకున్నాడు సిద్దూ.

**కొంతసేపయ్యాక సిద్దూ మెహెరాబాద్‌లోనే ఉండటం చూసిన బాబా, ఏమిటి నీవింకా** ఇక్కడే వున్నావ్? అని ప్రశ్నించారు. ఎండ చుర్రుమంటోంది. చూడు బాబా!! సూర్యుడు ఎలా మండిపోతున్నాడో. అందుకే కాస్త చల్లబడ్డాక వెళ్దామనుకున్నానని చెప్పాడు.

**నాతో అలా చెప్పడానికి నీకు సిగ్గుగా లేదు, అని బాబా కోప్పడ్డారు. నేను నిన్ను వెళ్ళమన్నాను** అంటే, ఆ క్షణంలోనే నీవు వెళ్ళాలని అర్థం. కానీ నీవింత వరకూ వెళ్ళలేదు కదా, సాయంత్రం నీడలో వెళ్తానంటున్నావ్ అని చివాట్లు పెట్టారు. వెంటనే బయల్దేరుతున్నాను బాబా అంటూ నగర్‌కి సైకిల్ ఎక్కాడు. నా మాట కాదని, ఇప్పుడు వెళ్ళి ఏం ప్రయోజనం అన్నారు బాబా. బాబాకి దయ లేదు, ఎంత కఠినాత్ముడో అని గొణుక్కుంటూ, మండు టెండలో సైకిల్‌పై సిద్దూ బయల్దేరాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే కలింగడ్ అనే ప్రేమికుడిని పిలిచి, ఓ మోటారు ట్రక్కు తీసుకుని అందులో సిద్దూని ఎక్కించుకుని తీసుకు

రమ్మనమన్నారు. ఇది తెలిసి సిద్ధూ నిరుత్తరుడయ్యాడు. ఆ దరిమిలా బాబా సిద్ధూతో, నిజమే! నీతో నేను చాలా కఠినంగా ప్రవర్తించాను. నన్ను క్షమించు. ఒక్కోసారి నేనేం చేస్తున్నానో నాకే తెలియదు. కొన్నిసార్లు ఇలా జరుగుతుంది. ఇంకెప్పుడైనా నీతో ఇలా ప్రవర్తిస్తే, నాకు ఆ విషయం గుర్తుచేయి అని సిద్ధూతో బాబా అన్నారు. సిద్ధూ తన తప్పు తెలుసుకుని క్షమించమని వేడుకున్నాడు. తన అవిధేయతను క్షమించమన్నాడు. దయార్ద్ర హృదయుడు మెహెర్‌బాబా అని తెలుసుకున్నాడు సిద్ధు.

## సింగం బారిన సిద్ధు

**1943వ సంవత్సరం ఏప్రిల్ 26వ తేది. ఆ రోజున బాబా తన మండలితో కలిసి భిలార్ అనే** గ్రామానికి ఒకట్రెండు రోజులు ఉండి తిరిగి వచ్చేద్దామని మెహెరాబాద్ నుండి బయల్దేరారు. మహమ్మద్ మస్తుని తీసుకుని సిద్ధూ భిలార్‌కి వచ్చాడు. మహమ్మద్ మస్తుతో భిలార్‌లో బాబా తన ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. మహమ్మద్ మస్తు అవసరాలు చూసుకోవడమే సిద్ధూకి బాబా అప్పగించిన ముఖ్యమైన పని. సిద్ధూ ఈ పనిని తన జీవిత చరమాంకం వరకూ నిస్వార్థంగా నిర్వర్తించాడు.

మహారాష్ట్రలోని **సతారా జిల్లాలో పంచగని – మహాబళేశ్వర్ మార్గంలో వుందీ గ్రామం. స్ట్రాబెర్రీల పంటకు ఈ గ్రామం ప్రసిద్ధి. ఆ వేళ ఏప్రిల్ 28వ తేది. రాత్రి పొద్దుపోయాక మల విసర్జన కోసం** ఊరికి దూరంగా వున్న అడవిలాంటి ప్రాంతానికి సిద్ధు వెళ్ళాడు. దట్టమైన అడవి ఎక్కువ భిలార్‌లో. క్రూరమృగాలకు నెలవు. పెద్ద పులులు, సింహాలు రాత్రిళ్ళు యథేచ్ఛగా తిరుగుతుంటాయి. ఇది తెలిసో తెలియకో సిద్ధూ ఒంటరిగా అక్కడికి వెళ్ళాడు. మలవిసర్జన కోసం కూర్చున్న కొన్ని క్షణాల్లోనే జూలు విదుల్చుకుంటూ సింహం వచ్చి సిద్ధూ ఎదుట నిల్చుంది. చిమ్మ చీకటి. కన్ను పొడుచుకున్నా ఎదుట వున్నది కనపడని కారు చీకటిలో సింహం కళ్ళు చింత నిప్పుల్లా ధగధగమంటున్నాయి. సిద్ధూ పై ప్రాణాలు పైకి పోయినట్లైంది. బాబా! బాబా! అని గట్టిగా బాబాని పిలవాలని పించింది. కానీ నోట్లో నాలిక తడి ఆరినట్లైంది. నాలిక పైనున్న అంగిలిని తాకింది. నోట మాట పెగల్లేదు. భయభ్రాంతుడయ్యాడు సిద్ధు. ఒళ్ళంతా చమటలు పట్టాయి. కడకు, స్పృహ తప్పి పడిపోయాడు.

**అదే సమయంలోనే ఆర్తత్రాణ పరాయణుడైన అవతారుడు కృష్ణ నాయర్‌ని పిలిచి, సిద్ధూకి** ఒక కబురు పంపమని చెప్పారు. సిద్ధూ తన గదిలో లేడని కృష్ణ నాయర్ బాబాతో చెప్పాడు. దాంతో బాబా మండలి వారిని లాంతర్లు, పొడవాటి కర్రలు తీసుకుని అడవిలో సిద్ధూ కోసం వెదకి పట్టుకు రమ్మనమని ఆదేశించారు. ఛగన్, నీలూ, విష్ణు, మాసాజీ అందరూ లాంతర్లు తీసుకుని అడవికి బయల్దేరారు. సింహం ఎదుట సొమ్మసిల్లిన సిద్ధూ

కనిపించాడు. వీరందర్నీ చూసిన సింగం అడవిలోకి పారిపోయింది. కానీ భయంతో వణికిపోతున్న సిద్దూ వెంటనే ఏం జరిగిందో చెప్పలేకపోయాడు. మండలి వారందరూ కలిసి అతడ్ని ఎత్తుకుని బాబా దగ్గరకు తీసుకువచ్చారు. ఆ తర్వాత, కృతజ్ఞతతో బాబాకు రెండు చేతులూ జోడించి ప్రణమిల్లాడు సిద్దూ. అవతారుని సేవ – ప్రేమలో తరించిన సిద్దూ జీవన రేఖాచిత్రంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో. అవి గ్రంథస్తం చేస్తే ఒక ఉద్గ్రంథమవుతుంది.

**1955లో మెహెర్‌బాద్‌లో జరిగిన తెలుగు ప్రాంతీయ సహవాస్‌లో సిద్దూని సహవాసీలకు** బాబా పరిచయం చేస్తూ, బాబా తన రెండు చేతులూ జోడించి సిద్దూకి నమస్కరిస్తున్నా నన్నారు. మీ అందరికీ అతనొక నిరక్ష్యరాస్యుడుగా కనిపిస్తాడు. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా అతను నాకు అందజేస్తున్న నిరుపమానమైన సేవను మాటల్లో వర్ణించలేను. నా ఎడల గల అతని ప్రేమ, విధేయత గురించి చెప్పాలంటే కొన్ని సంవత్సరాలు అవసరమౌతాయి. సిద్దూ 1926 నుండి సిద్దూ నా వద్ద వుంటున్నాడు. నా ఎడల గల అతని విశ్వాసం పలువురికి ఆదర్శనీయం అన్నారు అవతారుడు. అతనిపై నాకు పూర్తి భరోసా వుంది. ఎన్ని జపతపాలు చేసినా అతని సేవకు సరితూగవన్నారు బాబా. సాక్షాత్తూ యుగావతారుని ప్రశంశలు పలువురి ఎదుట అందుకున్న సిద్దూ – సిద్దుడే!!

**అవతారుని సేవలోనే 1975 అక్టోబరు 25న సిద్దూ బాబాలో ఐక్యమయ్యాడు. ధన్యుడు!**

***

## బాబావారి ప్రశ్న - జవాబు

**ఒక సందర్భంలో బాబా ఓ చిక్కు ప్రశ్న వేశారు.**
సాంఖ్య మతస్తుడు, జంతువు, నాస్తికుడు, పసిపిల్లవాడు, మూర్ఖుడు.
వాళ్ళకీ బ్రహ్మైక్యం పొందిన వ్యక్తికీ మధ్య పొంతన ఏమైనా వుందా? ఇదీ ఆ ప్రశ్న.
ఈ చిక్కు ముడి మేము విప్పలేం అన్నారు మండలి.
**బాబా చిరునవ్వు నవ్వారు, "సరే! నేనే చెప్తాను' అన్నారు.**

**మతం పట్టనివాళ్ళు ఇద్దరే ఇద్దరు – బ్రహ్మైక్యం పొందినవారు. సాంఖ్య మతస్తుడు.**
**డబ్బు గురించి పట్టనివాళ్ళు ఇద్దరే ఇద్దరు – బ్రహ్మైక్యం పొందిన వ్యక్తి, జంతువు,**
**దేముడిని పూజించని వాళ్ళు ఇద్దరే ఇద్దరు – బ్రహ్మైక్యం పొందిన వ్యక్తి, నాస్తికుడు.**
**కామానికి అతీతులు ఇద్దరే ఇద్దరు – పసిపిల్లవాడు. బ్రహ్మైక్యం పొందిన వ్యక్తి.**
**కోపం రాని వారు ఇద్దరే ఇద్దరు – మూర్ఖుడు, బ్రహ్మైక్యం పొందిన వ్యక్తి అన్నారు.**

# నెమరు
# ఆవతారుని ఆంధ్ర పర్యటన
## మెహెరీశంలో నమోదుకాని ఆసక్తికర సంఘటనలు



**శ్రీ పుళ్ళూరి శ్రీరామాచార్యులు (90),** శ్రీమతి గోవిందమ్మ దంపతులు (85) ఎర్రగుంటపల్లి గ్రామం, ఏలూరు జిల్లా, వాస్తవ్యులు. ఇటీవల 2026 జూలై 10న మెహెర్‌బాబా మౌన వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురించిన శ్రీ మల్లాది కృష్ణానంద్ గారి ప్రత్యేక వ్యాసం చదివిన ఈ దంపతులు, బాబావార్ని తాము 1954 ఫిబ్రవరిలో దర్శించుకున్నామని మా ప్రతినిధితో ఫోన్‌లో చెప్పారు.

అంతేకాదు, మెహెర్‌బాబా మా ఇంటికి వచ్చారు. ఆయన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింహాసనంలో బాబా ఆసీనులయ్యారు. మేం బాబా పాదాలను మంచి తీర్థంతో కడిగి పాదాభివందనం చేశాం. కర్పూర ఆరతి పట్టాం. ఈ వివరాలు నేటి వరకూ బాబా సాహిత్యంలో ఎక్కడా నమోదు కాలేదని మా అభిప్రాయం. క్లుప్తంగా ఆ వివరాలు ఇలా వున్నాయంటున్నారు శ్రీ బ్రహ్మం గారు, శ్రీమతి గోవిందమ్మ దంపతులు. ఇకపై వారి మాటల్లోనే చదువుకుందాం!

***

**మెహెర్‌బాబా 1954 ఫిబ్రవరి 20 నుండి మార్చి 4 వరకూ ఆంధ్ర రాష్ట్రంలో పర్యటించారు. ఈ విషయం పాఠకులందరికీ తెలుసు. మేము పశ్చిమ గోదావరి జిల్లాలోని** ఎర్రగుంటపల్లి గ్రామస్తులం. ఇది చింతలపూడి మండలంలో వుంది. సత్తుపల్లి – చింతలపూడి గ్రామాల నడుమ రాష్ట్ర రహదారికి ఒక ప్రక్కగా వున్న చిన్న గ్రామం. నా పూర్తి పేరు పుళ్ళూరి శ్రీరామాచార్యులు. ఐతే, స్థానికంగా నన్ను అందరూ బ్రహ్మం గారని పిలుస్తారు.
**ఆనాడు మెహెర్‌బాబా ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాలలో**

**రమారమిన 60 మంది ప్రేమికుల ఇళ్ళను,** కొన్ని విద్యాసంస్థలను సందర్శించారు. కొంతమంది ఇళ్ళకు అకస్మికంగా వెళ్ళి, ఆ ఇంటి యజమానుల్ని ఆశ్చర్యపరిచారు. ఆనాడు ఆంధ్ర రాష్ట్రంలో సుమారు 90 వేల మందికి పైగా బాబావారిని దర్శించుకున్నారని అంచనా. మెహెర్‌బాబా ఏలూరులో అనేకమంది ఇళ్ళను సందర్శిస్తూ, ఏలూరు పట్టణ శివార్లలో వున్న **'మాదేపల్లి'** అనే ప్రాంతంలో వున్న మా మేనమామ గారి ఇంటికి కూడా బాబా వస్తున్నారని, స్థానిక కార్యక్రమ నిర్వాహకులు ముందుగా తెలియజేశారు.

**మా మేనమామ గొప్ప బాబా ప్రేమికుడు. ఆయన పేరు శ్రీ పెద్దోజు వీర బ్రహ్మాచార్యులు.** భగవంతుడు మా ఇంటికి వస్తున్నారని, ఆయన ఎంతో భక్తి – ప్రేమతో బాబావారి కోసం ప్రత్యేకంగా ఒక ఎత్తైన సింహాసనాన్ని టేకు కలపతో చేయించాడు. మా ఇంటి ప్రాంగణ మంతా చక్కగా అలంకరించాడు. ఇలా బాబా రాక కోసం ఎదురుచూస్తుంటే, ఏ కారణమో తెలియదుకాని, అవతారుని కార్యక్రమంలో మార్పు వచ్చిందని, బాబా సందర్శించే 'హౌస్ విజిట్స్‌లో' మా ఇల్లు లేదని ఆఖరి నిముషంలో కబురు వచ్చింది. మేమంతా హతాశులమయ్యాం. మా మేనమామ కళ్ళలో నీరు చిప్పరిల్లింది. ఆయన చాలా బాధపడ్డాడు.

**అవతారునికి అవగతం కానిది ఏముంది? బాబా బృందం ఏలూరు నుండి కారులో** బయల్దేరాక, తిన్నగా ఎర్రగుంటపల్లిలోని మా ఇంటి ముంగిట ఆగారు. ఈ ప్రయాణంలో బాబా ఫలానా గ్రామం, ఫలానా ఇంటి ముందర ఆగేలా తగిన సూచనలు డ్రైవర్‌కి ఇచ్చారని ఆ పిదప తెలిసింది. బాబా వారి కారు దిగి, "అవతార్ మెహెర్‌బాబాకి జై" అని మిన్నంటిన జయ జయధ్వానాల నడుమ, ఆయన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆసనంలో ఆసీనులయ్యారు. ఇది నమ్మలేని నిజం. మా ఇంటిల్లిపాది బాబాకు పాదాభివందనం చేశాం. అవతారుని పాదాలను మంచినీటితో కడిగి ఆ చరణామృతాన్ని అందుకున్నాం. కర్పూర ఆరతి పట్టాం. మా అందరికీ ఆ రోజు ఒక మరువలేని పండుగ రోజు. అప్పటికి నా వయస్సు 14 సంవత్సరాలు. నిర్వాహకులు పర్యటనలో మార్పు చేశారు. ఐనప్పటికీ ఎదురుచూస్తున్న తన ప్రేమికుని ఇంటికి నేరుగా వచ్చారు. అవతారుని చమత్కారం అన్యులకు అర్థం కాదు. ఆనాడు జరిగిన ఈ సంఘటన బాబా మండలికి, స్థానిక నిర్వాహకులనూ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. **ఇది సత్యం.**

## వీడ్కోలు – పూలదండ

**1954 మార్చి 4న మెహెర్‌బాబా బృందం పూణేకు తిరుగు ప్రయాణమయ్యారు. బాబా బృందానికి వీడ్కోలు చెప్పాలని నేనూ, మా** మేనమామ ఇద్దరం ఏలూరు రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాం. ఐతే, చిన్న తప్పు జరిగిందన్నాడు మా మామ. ఏమంటే, 'బాబా కోసం ఒక

పెద్ద పూలదండని ఏలూరు గడియారపు స్థంభం దగ్గర ఆర్డర్ చేశాను. దాన్ని తీసుకురావడం మరచిపోయానని కంగారు పడుతూ చెప్పాడు'. స్టేషన్ నుంచి గడియారపు స్థంభం సుమారు 3 కిమీ దూరంలో వుంది. దాంతో నేను పరుగున అక్కడకు వెళ్ళాను. పూలదండ తీసుకుని తిరిగి సమయానికి స్టేషన్‌కి చేరుకున్నాను. స్టేషన్‌లో రైలు ఆగి వుంది. బాబా తన బోగిలో కిటికీ వద్ద కూర్చున్నారు. వేలాదిమంది ప్రేమికులతో రైల్వే ఫ్లాట్‌ఫారం కిటకిటలాడుతోంది. నా చేతిలో వున్న పూలదండను నేరుగా బాబాకు ఇవ్వడం చాలా కష్టంగా తోచింది. దాంతో నాకు ఎదురుగా వున్న వారికి పూలదండని ఇచ్చి, అంచెలంచెలుగా, బాబావారికి అందజేసేలా చేశాను.

**అప్పుడు బాబా ఏం చేశారో తెలుసాండి.**

**ఈ పూలదండ పంపిన వానిని తన దగ్గరకు పిలవమన్నట్లు బాబా తన చూపుడు వేలు** చూపిస్తుంటే, ఎవరికివారు తమనే పిలుస్తున్నారనుకున్నారు. ఐతే, నా దగ్గరకు వచ్చే వరకూ బాబా "ఔనని" అనలేదు. ఆ తర్వాత నేను బాబా దగ్గరకి వెళితే, ప్రేమతో ఒక పెద్ద ఆపిల్ నా చేతిలో తన ప్రసాదంగా పెట్టారు. ధన్యోస్మి అనుకున్నాను.

## నా భార్యకు అరటిపండు ప్రసాదం

**ఆనాటి బాబావారి పర్యటనలో జరిగిన మరో చిన్న సంఘటన ఏమంటే,** బాబా తాడేపల్లి గూడెంలో ప్రజాదర్శనం ఇస్తున్నారు. సుమారు 8 సంవత్సరాల వయస్సున్న ఒక ఆడపిల్ల తన తల్లితో కలిసి దోబిచర్ల గ్రామం నుండి తాడేపల్లిగూడెం మీదుగా నిడదవోలు వెడుతున్నారు. అలావెళ్తూ, తాడేపల్లిగూడెంలో బాబా ప్రజా దర్శనం ఇస్తున్నారని తెలిసి, అక్కడ కాసేపు ఆగి, బాబావార్ని దర్శించుకున్నారు. బాబా పాదాలకు నమస్కరించారు. ఆ చిన్నారి పాపకు బాబా రెండు అరటి పళ్ళు ఇచ్చారు. అంతక్రితం ఆ చిన్నారి కూడా బాబాకు రెండు అరటి పళ్ళను భక్తితో సమర్పించింది. ఆ అమ్మాయి పేరు గోవిందమ్మ.

**ఆ దరిమిలా, అంటే సుమారు పది పదిహేను సంవత్సరాల తర్వాత ఆమెతో నాకు వివాహ మయ్యింది.** ఆమె బాబావారిని దర్శించుకోవడం, ఆయన నుండి ప్రసాదం అందుకున్న వైనం నెంపాదిగా నాతో చెప్పింది. అలా మమ్మల్ని ఇద్దర్నీ బాబా కలిపారని ఇప్పుడని పిస్తుంది. **ఇలా మేమిద్దం ఒకరికి తెలియకుండా మరొకరం మెహెర్‌బాబాని 1950వ దశకంలో ఆంధ్ర రాష్ట్ర పర్యటనలో దర్శించుకున్నాం. ఆనాటి అవతారుని దివ్యమంగళ రూపం మా మదిలో నేటికీ చిరస్మరణీయంగా నిలిచిందని అంటున్నారు శ్రీ బ్రహ్మం గారు (మొబైల్ – 85005 76578). ఇలా.. ఆనాడు అవతారుడిని ఆంధ్రా పర్యటనలో ఎందరో దర్శించుకున్నారు. మెహెరీశంలో నమోదుకాని ఇలాంటి వారి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో.**

# మెహెరాబాద్ వ్యవసాయ క్షేత్రంలో



2026 ఆగస్టు 8 నుండి 13 వరకూ ఉత్తరాంధ్ర బాబా ప్రేమికుల బృందం మెహెరాబాద్‌లో స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 50 ఏళ్ళు పైబడి 80 ఏళ్ళ వయస్సున్న వారి వరకూ సుమారు 60 మంది, తమ వయస్సును మరచి హుషారుగా పలు వ్యవసాయ, పరిసరాల పరిశుభ్రత పనులలో పాల్గొన్నారు. బాబా ట్రస్టు సభ్యులు శ్రీ పి. రాజేంద్ర మెహెర్, శ్రీ కొల్లి రామారావు, విజయనగరం కేంద్రం ఆధ్వర్యంలో సుమారు వారం రోజులు **మెహెరాబాద్ వ్యవసాయ క్షేత్రంలో** కలుపు మొక్కలను ఏరిపారేడం నుంచి అనేక వ్యవసాయ పనులను ఆనందంగా చేపట్టి పూర్తిచేశారు. ఈ బృందంలో సుమారు 30మంది స్త్రీలు పాల్గొన్నారు. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుండి కూడా వచ్చిన బాబా ప్రేమికులు కొందరు ఈ బృందంలో వున్నారు.

# బాబాలో ఐక్యం



శ్రీ పి. వెంకయ్య గారు (89) హైదరాబాద్ 2026 జూలై 18న బాబాలో ఐక్యమయ్యారని శ్రీ పిడుగు అప్పారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకయ్య గారు బాబా సందేశాలపై వివరణాత్మకంగా ప్రసంగించేవారు. నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన శ్రీ వెంకయ్య ధన్యుడని, స్థానిక బాబా ప్రేమికులు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని కొన్ని క్షణాలు మెహెరుడ్ని మౌనంగా ప్రార్థించారు. వీరు శ్రీ పిడుగు అప్పారావు గారికి స్వయాన మేనమామ అని చెప్పారు.

# ఆరంగాంలో అవతారుని నూతన కేంద్ర భవనం



**అవతారుని నూతన కేంద్ర భవన నిర్మాణానికి 2026 ఆగస్టు 2న భూమి పూజ చేశారు.** బాబా ట్రస్టు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2027 జనవరి 2 నాటికి ఈ భవన నిర్మాణం పూర్తిచేసుకుని, బాబా కేంద్రాన్ని ప్రారంభించాలన్నది మా లక్ష్యం అని ట్రస్టీ శ్రీ రమేష్ జంగ్లే తెలిపారు. ఈ భవన నిర్మాణాన్ని బాబా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ఈ కేంద్ర నిర్మాణ ఆవశ్యకత గురించి ప్రస్తావిస్తూ, 1950వ దశకం నుండి తమ తండ్రి** శ్రీ జంగ్లే మాస్టర్ గారింట్లో బాబా కేంద్రం నిర్వహిస్తుండేవారన్నారు. ఐతే, బాబా ప్రేమికుల సంఖ్య క్రమేపీ పెరుగుతుండటంతో, పూణే, గురుప్రసాద్‌లో బాబా దర్శన కార్యక్రమంలో వుండగా, మా నాయన చొరవ తీసుకుని **'ఆరంగాంలో బాబా కేంద్రానికి'** తగిన అనువైన భవనం కేటాయించవలసిందిగా బాబాని నేరుగా కోరారు. ఆ దరిమిలా, ఆరంగాంలో వున్న ఫ్యామిలీ క్వార్టర్స్‌లో ఒక భవనాన్ని కేంద్ర ఏర్పాటుకు అవతారుడు అంగీకరించడమే కాకుండా, **ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక** 1960 జనవరి 2న, అవతారుడే స్వయంగా తమ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆనాడు స్థానిక ఆరంగాం ప్రజలందరికీ బాబా ప్రత్యేక దర్శనం ఇచ్చారు. గ్రామంలో వున్న పలువురి ప్రేమికుల ఇళ్ళను సందర్శించారు. **ఐతే, ఆనాడు మట్టి గోడలతో నిర్మితమై వున్న ఫ్యామిలీ క్వార్టర్స్‌కు తరచు మరమ్మతులు** రావడం, 1970వ దశకంలో ఫ్యామిలీ క్వార్టర్స్ అన్నింటినీ తొలగించి వాటి స్థానంలో ప్రస్తుతం మనం చూస్తున్న **'మెహెర్ ఆసుపత్రి'** నిర్మాణం ప్రతిపాదించడంతో, బాబా కేంద్రాన్ని దగ్గరలోనే వున్న గ్రామ పంచాయతీ భవనాలకు తాత్కాలికంగా తరలించారు. నేడు గ్రామ పంచాయితీ భవనాలను పడగొట్టి వాటి స్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుండటంతో, ఆరంగాంలో అవతారుని నూతన కేంద్ర నిర్మాణానికి ట్రస్టువారు పూనుకున్నారని శ్రీ రమేష్ జంగ్లే తెలిపారు. **ఇది ఆరంగాం ప్రేమికులకు అవతారుడు అందిస్తున్న 2027 జనవరి నూతన సంవత్సర కానుక అని, స్థానిక బాబా ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.** ❋



# మెహెరీశం

**అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర**

**ఆంగ్ల మూలం:- భావూ కల్చూరీ**

**లార్డ్ మెహెర్, 1925 నుండి**

**తెలుగుసేత: మల్లాది రామారావ్, మెహెరాబాద్**

**(గత సంచిక తరువాయి)**

**లూగానో పర్వంపై మే 7వ తేదీ సాయంత్రం తెరపడింది. లండన్‌లో చలి, వర్షం తట్టుకోలేక** ఈ వూరు వచ్చారు బాబా. పది రోజులున్నారు. తిరుగు ప్రయాణం మళ్ళీ లండన్‌కే. రైలు ఎక్కారు. మర్నాడు ఉదయం తొమ్మిదింటికి పారిస్ చేరారు. బస హొటల్ పవర్స్ ఐదవ అంతస్తులో.

**లుగానో వెడుతూ పారిస్‌లో ఆగినప్పుడు మింటా ఏమి చేసిందో గుర్తుందా పాఠక** మహాశయా! హొటల్ పైఅంతస్తు నుంచి దూకబోయింది. పెద్ద ఆదీ సకాలానికి వచ్చి ఆపాడు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ చిన్నారి ప్రాణం అనంత వాయువుల్లో కలవల్సింది. ఇప్పుడు మళ్ళీ పారిస్‌లో అడుగుపెట్టగానే ఆత్మహత్యకు పూనుకొంది, బాబావారి దయవల్ల ఆ ప్రయత్నం ఫలించ లేదనుకోండి.

**ప్రభువు ఆమెని అనునయించారు. మింటాకి యిదేమి పోయేకాలం. సాక్షాత్తూ దేవదేవుడి** కొలువులో వుంటూ కూడా ఆత్మహత్య ప్రయత్నమా అంటూ ముక్కున వేలు వేసుకోవచ్చు పాఠకులు. నిజమే. ఆమె చేస్తున్న పని తప్పే! ఆత్మహత్య అసహజ మరణమనీ, వెంటనే పునర్జన్మ వుండదనీ, ఆత్మ దుర్భర జీవితం గడుపుతుందనీ మెహెరుడు శెలవిచ్చారు. బాబా వారు చెప్పిన మరో మాట కూడా గుర్తుంది ఆమెకి. ఆధ్యాత్మిక మార్గంలో ఈర్ష్య మంచిదే. ముందుకు వెళ్తావు. కానీ నిజజీవితంలో ఈర్ష్య, అసూయ విద్వేషానికి దారి తీస్తాయి. గుర్తుంచుకో ఈ సంగతి అన్నారు. ఈ రెండు ఉవాచలు మింటా చెవుల్లో రింగు రింగుమంటున్నాయి. కానీ ఆత్మహత్యకి పూనుకొంది. ఒకసారి కాదు రెండు సార్లు. ఎందుకని? ఎందుకంటే, బాబావారి వ్యక్తిగత పరిచారకురాలిగా వుండాలన్నది మింటా ఇచ్ఛ. బాబావారి పనులన్నీ కిమ్ చేస్తుండటంతో మింటాకు అవకాశం చిక్కడం లేదు. దీనితో యిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇది చూసి తలపట్టుకొంటున్నారు మిగిలిన శిష్యులు. బాబావారినే నమ్ముకొన్నాం. అంటి పెట్టుకొని వుంటాం చివరి శ్వాస వరకూ అంటున్న వీరికి ఇదేం పోయేకాలం. నేనే ప్రభువుకి పరిచర్యలు చేయాలన్న

పట్టుదల దేనికి అని విస్తుపోతున్నారు. మింటా – కిమ్‌ల రుసరుసలు, బుస బుసలు కాలక్షేపం బఠానీలయ్యాయి. వీరిద్దరి మధ్య చిచ్చుపెట్టిన మెహెరుడు వీళ్ళ గొడవ పట్టించు కొంటున్న దాఖలా లేదు.

**మింటా ఉదంతం అయిన కాసేపటికి బాబావారు నగరం చుట్టి వద్దామన్నారు. వెంటనే** టాక్సీ పిలిపించి అందరూ రోడ్డున పడ్డారు. ఎందుకుట ఈ తిరగడం అంటే మనం లండన్‌కి బయలుదేరేది రేపు ఉదయం. ఈ వేళ మనకి ఏ కార్యక్రమాలు లేవు కాబట్టి ఖాళీగా కూర్చోకుండా పారిస్ అందచందాలు చూద్దామన్నారు. సాయంత్రం బాబావారు సంగీత కచేరీకి వెళ్ళారు. ఈ కార్యక్రమ వేదిక సంగీత గాన సభ. దానిపేరు ఫోలిస్ బెర్గెరె. బాబావారి వెంట కిమ్, డెలియాలు వచ్చారు.. మాకూ సంగీతం ఇష్టమని వారన్నారో, బాబావారే రమ్మన్నారో వాళ్ళని ఇదమిద్ధంగా తెలియదు కానీ గాన సభకి కిమ్, డెలియా వచ్చారు బాబాతో. 1869లో ప్రారంభమైనదీ గాన సభ. ఇప్పటికీ దిగ్విజయంగా సంగీత సేవ చేస్తోంది, ఈ గాన సభ శాఖని లాస్ వేగాస్ (అమెరికా)లో తెరిచారు. 1959లో విలాసవంతమైన జీవనసరళికి, జూదానికీ పేరుపడ్డ ఆ మహానగరంలో ఫోలిస్ బెర్గెరె ఎక్కువకాలం నడవ లేదు. ఈ మధ్యనే అంటే 2012లో మూత పడింది. బాబావారు సంగీత గాన సభకి వెడితే, మండలివారు సినిమాకు వెళ్ళారు. వారి వెంట మింటా వెళ్ళింది. సినిమా చూసింది.

**మర్నాడు అంటే మే 9వ తేదీ ఉదయం ఎనిమిదిన్నరకి బాబా లండన్‌కి బయలుదేరారు** మధ్యాహ్నం మూడుం పావుకి అక్కడికి చేరారు. దారి పొడువునా కిమ్, మింటా, డెలియా ఎక్కి ఎక్కి ఏడుస్తూనే వున్నారు. ఎందుకయ్యా వీళ్ళకి కన్నీరు అంటారా – వీళ్ళ భయం వీళ్ళది. లండన్‌లో మమ్మల్ని ప్రభువు దగ్గర వుండనిస్తారో లేదో తెలియదు. బాబా దగ్గరగా వుండాలన్నది ఈ ముగ్గురి వాంఛ. లండన్‌లో బాబావారికి బస ఏర్పాటు చేస్తున్న తీరు, మరింత గాభరా పెట్టింది. లండన్ వచ్చిన ప్రతిసారీ ప్రభువు కిట్టీ యింట బస చేస్తున్నారు. ఈ సారి అక్కడికి వెళ్ళటం లేదు. బాబా వ్యతిరేక ప్రచారం ముమ్మరంగా వుంది కాబట్టి మెహెరుడు మన యింట దిగడం శ్రేయస్కరం కాదనాన్నాడు కిట్టీ తండ్రి. ఇంకెక్కడయినా ఏర్పాటు చేయి బాబా బస అని చెప్పాడు కూతురితో ఇందువల్లనే కిట్టీ మార్గరెట్ ముందుస్తు ఏర్పాట్లకని బాబావారి కంటే ముందుగానే చేరారు లండన్. లాం కాస్టర్ గేట్ అన్న వీధిలో ఫెలోషిప్ క్లబ్బులో మెహెరీశుని విడిది ఏర్పాటు చేశారు. పారిస్ నుంచి వస్తున్న మెహెరుని డోవర్‌లో (ఇక్కడికి లండన్ వో డబ్బయి మైళ్ళు) కలిసి, బస ఏర్పాట్ల గురించి వివరించారు చిదానందుడు చిరునవ్వు నవ్వారు. సరే మీ యిష్టం అన్నారు. కిట్టీ, మార్గరెట్‌లు ప్రభువుతో పాటే ఫెలోషిప్ క్లబ్‌లో దిగారు. అందరికి ఐదో అంతస్తులో గదులు యిచ్చారు. యథాప్రకారం దర్శనానికి ఎందరో వచ్చారు.

జాన్‌బుల్ పత్రికలో బ్రంటన్ కథనాల ప్రభావం వాళ్ళపై పడినట్లు లేదు. ఆ తప్పుడు వ్రాతల్ని పట్టించుకో వద్దని కిట్టీకి చెప్పారు బాబా. "అవన్నీ చెత్త రచనలు. పట్టించుకోకు. వాటిపై దృష్టి పెట్టకు, అన్నారు. ఇటువంటి వ్రాతలంటే తమకి భలే యిష్టం అన్నారు. ఈ అవాకులు చెవాకులు నా దైవీకార్యక్రమానికి మంచి వూపునిస్తాయి అని చెప్పారు "ఎవరు ఏమనుకొన్నా, ఏం చేసినా నాకు పట్టదు. వాళ్ళ కంటే తెలివైనవాడిని కదా. నా ధోరణిలో నేను పోతాను", అని అంటూ కిట్టీకి ధైర్యం నూరి పోశారు.

**బాబా వారెప్పుడూ వో మంచి పిల్లాడిని వెదికి తీసుకురమ్మని మండలికి పురమాయించడం** పాఠకులకి తెలుసు. మంచి పిల్లాడితో బాబావారికేమి పని అని అనుకోవచ్చు. ఈ ప్రశ్న యిప్పుడే కాదు అప్పుడు కిట్టీకి కూడా వచ్చింది. ఆమె సందేహ నివృత్తి చేశారు బాబా. తమ దైవీకార్యక్రమానికి పిల్లాడు మాధ్యమం అన్నారు. "పసి పిల్లలు పటికలా స్వచ్ఛమైన వాళ్ళు. అభం శుభం తెలియని చిన్నారులు. అందుకనే నా కార్యక్రమానికి మాధ్యమాలు", అని వివరంగా ఇంకోమాట చెప్పారు. కొన్ని రకాల పనులకి మాధ్యమం స్త్రీలు. మరి కొన్ని పనులకి పురుషులు మాధ్యమం అన్నారు. అంటే బాబావారి మండలిలోని స్త్రీ, పురుషులు కూడా ప్రభవు ఎంపిక చేసుకొన్న వారే. "పాపాత్ములు, పుణ్యాత్ములు అన్న తేడా లేదు నాకు. ఆ యిద్దరూ వొక్కటే నాకు. కాబట్టి. పుణ్యాత్ములే ఎందుకు రావాలి నా దగ్గరకి. పాపాత్ములు సంగతేమిటి మరి. ఏ మాటకామాట చెప్పాలి, పాపాత్ములకే నా వద్ద పెద్దపీట" అన్నారు బాబా.

**బాబావారి అమెరికా యాత్రకి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. మెరిడిత్ స్టార్** దంపతులకి పిలుపు వెళ్ళింది "రండి, బాబావారితో అమెరికాకి". ఈ దంపతులు లండన్‌కి కొంచెం దూరంగా డేవోన్‌షైర్‌లో వున్న సంగతి పాఠకులకి తెలుసు. క్వెంటన్ టాడ్‌ని కూడా రమ్మని బాబావారు పిలిచారు. లండన్ నగరమంతా గాలించి, వో కుర్రాడిని తీసుకు వచ్చింది కిట్టీ. మీ పనికి ఈ కుర్రాడు పనికి వస్తాడంది బాబాతో. ప్రభువు పెదవి విరవ లేదు. తమ గదికి తీసుకువెళ్ళారు. మర్నాటి ఉదయం ఆ కుర్రాడిని పంపేశారు. 'వీడు నా పనికి తగడు' అన్నారు. అమెరికా యాత్రకి కుర్రాడు దొరక్కపోతే కుక్కపిల్లని తీసుకు వెడతాను నాతో అన్నారు బాబా నవ్వుతూ. ఆవేళ – అదే బాబావారు యిలా అన్న రోజు మే 10వ తేదీ, మంగళవారం – బాబావారు, పెద్ద ఆదీ, డెలియా, మింటా పెంపుడు జంతువుల షాపుకి వెళ్లారు. అక్కడ వొక కుక్కపిల్లా బాబావారికి నచ్చలేదు. "ఇవే కాదు ఇంకా వున్నాయి నా దగ్గర. మీ హొటల్‌కి తీసుకువస్తాను", అన్నాడు షాపు యజమాని. అన్నమాట ప్రకారం చాలా కుక్కపిల్లల్ని తీసుకువచ్చాడు. వీటిలో మంచిది కొందామను కొంటూ ధర అడిగాడు. ఎంతో కాదు సార్. వంద పౌండ్లు ఇప్పిస్తే చాలు అన్నాడు. చాలా ఎక్కువ ధర చెప్తున్నావ్ అన్నారు. లేదు సార్ ఎంతో సరసమైన రేటు చెప్పానన్నాడు

షావుకారు. ఇంత ఖరీదు కుక్క మాకక్కర్లేదన్నారు బాబా. నిరాశతో వెనుతిరిగాడు ఆ తెల్ల షావుకారు. సూర్యుడు అస్తమించిన బ్రిటీషు సామ్రాజ్యం రోజులవి. అప్పుడూ, ఇప్పుడూ కూడా పౌండు విలువ ఎక్కువ. ఒక పౌండ్‌కి 120 రూపాయలు నేటి మారక విలువ (2026 ననవంబరు నాటికి). ఒక విధంగా చెప్పాలంటే, పౌండ్ కంటే డాలరు చవక. అది అప్రస్తుతాంశం.

**బాబావారు క్వెంటిన్‌కి పని పెట్టారు. షాపులు గాలించి, మంచి కుక్కపిల్లని కొనుక్కురా** అన్నారు. అతగాడు వో నల్ల కుక్కపిల్లని తెచ్చాడు. బాబా వారికి నచ్చింది. చూశారా, మీరూ వున్నారు ఎందుకట అన్నట్లు మింటా, డెలియాలకేసి చూశారు క్వెంటిన్. పాపం వాళ్ళు యిద్దరూ చిన్నబుచ్చుకొన్నారు.

**మీరంతా కిమ్‌కో అయినట్లే, ఈ నల్లకుక్క మిక్కో అన్నారు బాబా. ఈ పేరు అందరికీ** నచ్చింది. ఆ రాత్రి బాబావారి దగ్గరే వుంది మిక్కో. తెల్లవారుతూనే డెలియాని పిలిచి, మిక్కో బాధ్యత నీదే అన్నారు. మహదానందంగా తీసుకొంది డెలియా తన చేతుల్లోకి మిక్కోను. ఆమె దగ్గర వో ఆర్నెల్లు వుందేమో, వో రోజున కారు క్రిందపడి చనిపోయింధి.

**భవిష్యవాణి తెలిసిన ప్రభువు అప్పటికే వో హెచ్చరిక వేశారు డెలియాకి. మిక్కో కోసం** గాభరా పడకండి. ఇదంతా నా దైవీ కార్యక్రమం. ఈ కార్యక్రమ సూత్రధారిని నేనే అని గుర్తుపెట్టుకోండి అని హెచ్చరించారు. మిక్కి చనిపోయిందని బెంగ పెట్టుకోవద్దని చెప్పకనే చెప్పారు. ఎందుకీ హెచ్చరిక ఇప్పుడనుకొన్నారు. ఆ సందేశం అందిన రోజున, మిక్కీ కారు క్రిందపడ్డ తర్వాత తెలిసివచ్చింది. మెహెరీశుని హెచ్చరిక ఎందుకో. పెంపుడు జంతువు ఏది మరణించినా బాధపడటం సహజం ఎవరికైనా. అందులోను అవతారుడు స్వయంగా పెంచమని యిచ్చిన కుక్కపిల్ల చనిపోతే ప్రాణం కొట్టుకుపోదా డెలియాకి. ఇది ఏ అశుభ సూచకమో అని తలపట్టుకొనేది. బాబావారు తమ సందేశంతో మరో తూరి చెప్పారు నీ చెంత నేనుండగ చింతలెందుకు అని.

**వో రోజున క్వింటన్ టాడ్ తీసుకువచ్చాడు రోమ్ లాండో అన్న రచయితని. పోలెండ్** దేశంలో పుట్టి, బ్రిటన్‌లో పెరిగి పెద్దవాడయ్యాడు. వయస్సు 33 సంవత్సరాలు. బాబావారిని దర్శించాలని వుంది అన్నాడు, అందుకని తీసుకువచ్చాను అన్నాడు కెంటిన్. బాబావారు అప్పుడు గది మధ్య వాలుకుర్చీలో కూర్చొని వున్నారు. ఉదయం కావటంతో బాబావారు సాదాసీదా బట్టల్లో వున్నారు. వూలు స్కార్ఫ్ కంఠాభరణంలా దర్శనమిస్తోంది. క్వెంటన్ తీసుకువచ్చాడని రోమ్ లాండోతో ముఖా–ముఖికి బాబావారు అంగీకరించారు. వో 45 నిమిషాలు సాగిందీ ఇంటర్వ్యూ. అతడు శరవేగంతో ప్రశ్నలు సంధించాడు. అతని ప్రశ్నలు అన్నింటికీ బాబావారి సమాధానం వొక్కటే–నీ ప్రశ్న బాగుంది కానీ ఒకటి రెండు మాటల్లో జవాబు సరిపోదు. కాస్తంత విస్తారంగా వివరణ ఇవ్వాలి.

ఒకటి రెండు రోజుల్లో పంపుతాను సమాధానాలు. సరే బాబా, మీ జవాబుల కోసం ఎదురు చూస్తుంటాను అంటూ లాండో వెళ్ళబోతుంటే, కాసేపు ఆగమన్నారు ప్రభువు. అక్షర ఫలకంపై మెహెరీశుని చూపుడు వేలు చకచకా కదిలింది. కూడబలుక్కొని చదివాడు లాండో. “నేను నీకు సాయం చేస్తాను మున్ముందు. ఇదీ సందేశం. ధన్యోస్మి అనుకొన్నాడు మన బ్రిటీషు రచయిత గారు. లాండో ప్రశ్నావళికి బాబావారు జవాబులు పంపారు. వెంటనే కాదు కానీ రెండు, మూడురోజుల తర్వాత. బాబావారు చెప్తుంటే, మండలి వారొకరు వ్రాసుకొని, లాండో చేతిలో పెట్టారు.

**లాండో ప్రశ్న – పశ్చిమాన ఆధ్యాత్మికత పునరుద్ధరణ ఎంత త్వరగా జరుగుతుంది. ఈ దిశగా మీరేం చేస్తున్నారు.**

**బాబా జవాబు –** మీ దేశాల్లో ఆధ్యాత్మిక వాతావరణం తిరిగి నెలకొంటుంది. ఆ శుభ ఘడియ ఎంతో దూరంలో లేదు. ఈ పునరుద్ధరణ అతి త్వరలోనే జరుగుతుంది. ఈ మార్పుని నేను తీసుకువస్తాను. ఇప్పుడు అమెరికా ప్రయాణం కడుతున్నది కూడా ఆధ్యాత్మికతకు కొత్త పూపునివ్వటానికే.

**అమెరికాలో అమోఘమైన శక్తి వుంది. ఇప్పుడు దుర్వినియోగం అవుతోంది ఆ శక్తి.** మరి నేను ఆ గడ్డపై కాలు పెట్టాక ఆ శక్తిని సన్మార్గంలో ప్రవేశపెడ్తాను. తద్వారా ఆధ్యాత్మికతకి కొత్త వూపు యిప్పిస్తాను. ఈ మార్పు ఎలా వస్తుందో తెలుసా? చిచ్చు బుడ్డి నుంచి రవ్వలు ఎగిసి పడినట్లు. మేఘాలు వొక్కసారి గర్జించినట్లు వస్తుంది. ఆధ్యాత్మిక బావుటా నింగికి ఎగిసి పడుతుంది. ఇటువంటి పరిణామం సాధారణంగా 700 ఏళ్ళకో, 800 ఏళ్ళకో వస్తుంది. యుగాంతంలో కానీ, యుగారంభంలో కానీ కూడా రావచ్చు యింతటి ఆధ్యాత్మిక సంచలనం. క్రీస్తు చైతన్య స్థితిని పొందిన పరిపూర్ణుడు ఒక్కడే విశ్వవ్యాప్తంగా తన సందేశాన్ని అందించగలడు. విశ్వ కార్యక్రమాన్ని నిర్వహించగలడు. ఇహ నా దైవీ కార్యక్రమం అంటావా, దాని ప్రభావం అందరిపైనా, అన్నింటిపైనా పడుతుంది. జీవితంలో ప్రతి దశనీ ప్రభావితం చేస్తుంది. నియంత్రిస్తుంది. ఈ ప్రపంచాన్ని నేను ఆధ్యాత్మికంగా ముందుకు తోస్తాను. ఇందువల్ల ఏమవుతుందీ, రాజకీయ, ఆర్థిక సమస్యలు, లైంగిక సమస్యలు మొదలైనవన్నీ ఆటోమాటిక్‌గా పరిష్కారమవుతాయి. సర్దుకొంటాయి కూడా.

**....సశేషం**

## ఇల్లు అమ్మకానికి

**మెహెరాబాద్‌లో ఆంధ్ర రెస్ట్ హౌస్‌కి ఎదురుగా వున్న సింగిల్ బెడ్ రూం బిల్డింగ్ అమ్మకమునకు సిద్ధంగా వుందని శ్రీ శ్యాంసుందర్, విశాఖపట్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు 8866195448, 9553334337 సంప్రదించగలరు.**

AVATAR MEHER BABA PERPETUAL PUBLIC CHARITABLE TRUST
## Financial Report
1ST APRIL 2025 – 31ST MARCH 2026

# ట్రస్ట్‌కి మంచిరోజులు......

**(మల్లాది రామారావ్, మెహెరాబాద్)**

**ట్రస్ట్‌కి గడ్డు రోజులు పోయాయి. మంచి రోజులు వచ్చాయి. అమెరికా, బ్రిటన్ వంటి** దేశాల నుంచి విరాళాలు సేకరించుకొనే వెసులుబాటును కేంద్రం మళ్ళీ కల్పించింది. విదేశీ విరాళాల క్రమబద్దీకరణ చట్టం క్రింద నిషేధానికి లోనవటంతో గత కొంత కాలంగా విదేశాల నుంచి భూరి విరాళాలు రాక, మనవాళ్ళ విరాళాలు అంతంత మాత్రం గానే వుండటం వల్ల, బాబా ట్రస్టు వారు చాలా ఇబ్బంది పడ్తూ వచ్చారు. సిబ్బంది జీతభత్యాలు ఇబ్బడి ముబ్బడిగా పెరగటంతో మెహెరాబాద్, మెహెరాజాద్‌లో మరిన్ని సదుపాయాలు కల్పించే పని కుంటుపడింది.

**అవతారుడి దయవల్ల ఆ గడ్డు రోజులపై తెరపడింది ఏడెనిమిది నెలల క్రిందట. దాదాపు** 18 నెలల పాటు ఢిల్లీ చుట్టూ పదే పదే తిరిగాక మంచి రోజులు వచ్చాయి మనకి అంటున్నారు ట్రస్టీ మెహెర్ ప్రసాదు రాజు గారు. ఢిల్లీ అధికార యంత్రాంగంతో మాట్లాడి, వొప్పించిన ఘనత ఆయనదీ, కరీంనగర్ తేజం బండి సంజయ్ గారిదీ. కేంద్ర దేశీయాంగశాఖ సహాయ మంత్రి కావటంతో, సంజయ్ గారి మాటకి మంచి బలం, వూపు చేకూరాయి.

**బండి వారు రంగప్రవేశం ఎప్పుడు చేశారు? ఎలా చేశారు? కరీంనగర్ బాబా సెంటరు** భవన నిర్మాణానికి రాళ్ళు ఎత్తిన వాడిని నేనే. బాబావారి ప్రసాదం ఎన్నిసార్లు కళ్ళకి అద్దుకొని నోట్లో వేసుకొన్నానో. ఈ మాత్రం చేయకపోతే అవతారుడు మెచ్చడు అంటారు బండి సంజయ్ గారు. వారితో రాజు గారిది పూర్వ పరిచయం. కరీంనగర్ బాబా సెంటరు పెద్దలు కూడా తలో మాటా చెప్పారాయనతో.

**విదేశీ విరాళాల నియంత్రణ చట్టం వ్యవహారాలు బండి వారి పరిధిలో లేవు. ఆ బాధ్యత** మరో కేంద్ర దేశీయాంగ శాఖ సహాయ మంత్రిది. తోటి మంత్రి చెపితే కాదనలేదు ఆ పెద్ద మనిషి. విదేశీ విరాళాల వ్యవహారాలు చూసే అధికారులు రెండు మూడుసార్లు మెహెరాబాద్‌కి వచ్చారు. ట్రస్టు పనులు చూశారు. ట్రస్టీలకి జీతభత్యాలు లేవనీ, స్వచ్ఛందంగా పనిచేస్తున్నారనీ విని ఆశ్చర్యపోయారుట. దేశంలో ఎక్కడ ఏ మారుమూల

ట్రస్టువున్నా **"ఘోటాలా"** జరుగుతున్న నేటి భారతంలో, స్వచ్ఛంద కార్యకర్తలుగా పనిచేసే ట్రస్టీలు వున్నది బహుశా మన బాబా ట్రస్టుకే.

**కేంద్రంతో మాటా మంతీ జరుపుతున్నప్పుడు వో ఐ.ఎ.ఎస్ ఉన్నతాధికారి తరచి తరచి** ప్రశ్నించారుట మెహెర్‌ప్రసాద్ రాజుగారిని. 'నిజంగా మీరు జీతం తీసుకోరా', అని అడిగాడుట. 'ఆహా! నిజంగానే జీతం ఇవ్వరు మాకు" అంటూ రాజు గారు, చెప్పారుట.

**బాబావారి దయ వల్ల నాకు కానీ, మా మిగిలిన ట్రస్టీలకి కానీ, డబ్బు ఇబ్బంది లేదు.** నా సంగతే తీసుకోండి. రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేశాను. ఇప్పుడు ఇది సృష్టికర్త యిచ్చిన పని అని చెప్తుంటే, ఆ ఉన్నతాధికారి', తప్పకుండా మీ బాబావారి దర్శనం చేసుకొంటాను త్వరలో. మాది బీహారు. నాసిక్‌కి వచ్చాను చాలాసార్లు. ఈసారి మీ మెహెరాబాద్‌కి వస్తాను అన్నాడుట. ఏడెనిమిదిసార్లు రాజు గారు ఢిల్లీ వెళ్ళి రంగం సిద్ధం చేశాక, ట్రస్టు ఛైర్మన్ ఫెమ్‌రోజ్ మిస్త్రీ గారు రాజధానికి వెళ్లి భేటీ అయ్యారు. విదేశీ విరాళాలకి పచ్చజెండా వూపారు.

**విదేశీ విరాళాలపై నిషేధంతో పాటు, విదేశీయుల దిగువ మెహెరాబాద్ సందర్శనపైనా** ఆంక్షల్ని విధించింది ప్రభుత్వం లోగడ. ఇప్పుడు ఈ ఆంక్షల్ని సడలించే సూచన వుంది. విదేశీయులు వస్తున్నారన్నా, విదేశీ విరాళాలు వస్తున్నాయన్నా, మత ప్రచారానికని, మత మార్పిడులు ప్రోత్సహించడానికనీ అన్న అభిప్రాయం అప్పట్లో ప్రబలంగా వుండేది. దీనికితోడు, దిగువ మెహెరాబాద్‌ని ఆనుకొనే సైనిక స్థావరం - వాహనాల పరిశోధన, అభివృద్ధి కేంద్రం వుంది. అలనాడు మొఘలుల కాలం నుంచి, దరిమిలా బ్రిటీషు వారి కాలం నుంచీ అహమ్మద్‌నగర్ సైన్యానికి పెట్టని కోట. ఇక్కడి ఫౌండ్రీ ఇండస్ట్రీ ఆయుధాలకి పనికి వస్తుందన్న వుద్దేశ్యంతో, బ్రిటీషువారు నగర్‌కి రైలుమార్గం వేశారంటారు స్థానికులు.

**మెహెర్‌బాబా వారు నెలకొల్పిన ట్రస్టు అన్ని దేవాదాయ ధర్మాదాయ వ్యవస్థల వంటిది** కాదనీ, మత మార్పిడి వంటి ప్రక్రియలకి ఆమడ దూరంలో వుంటుందనీ రూఢి అవ్వటంతో విదేశీ ప్రేమికులు దిగువ మెహెరాబాద్‌కి, ఎగువ మెహెరాబాద్ సందర్శనపైనా, ఆంక్షలు సడలించబడే అవకాశాలు మెరుగయినై. బాబావారు కొత్త మతం పెట్టలేదనీ, కర్మకాండలకీ, పూజాది క్రతువులకీ పీట వేయలేదనీ విన్న ఢిల్లీ అధికార యంత్రాంగం 'మీరు నిజంగా నిజాయితీతో పనిచేస్తున్నారు" అని కితాబు ఇచ్చింది. నిజం నిలకడ మీద తెలుస్తుంది. సృష్టికర్త యిచ్చిన / నిర్దేశించిన పని ఆయనే చేస్తాడు అన్నది ఇందుకోసమే అనాలి. **ఇహ మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో, ట్రస్టు ఆర్థిక పరిస్థితి కొంచెం** మెరుగు అయిందని వేరే చెప్పాలా? బ్యాంకుల్లో డిపాజిట్లపై వడ్డీ అంతంత మాత్రంగానే వస్తున్నా ట్రస్టు ఇబ్బంది పడటం లేదు ఇప్పుడు.

ఖర్చు 9.2 శాతం పెరిగింది. మరి విరాళాల రూపంలో వస్తున్న ఆదాయం 26.8 శాతం పెరిగింది. విదేశీ విరాళాల రూపంలో రూ.88 లక్షలు వచ్చాయి. ఒక భక్తుడు రూ.1.4 కోట్ల దానంగా యిచ్చాడు. వచ్చిన మొత్తం విరాళాలు రూ.8.4 కోట్లు. ఖర్చు విషయానికి వస్తే, అధిక భాగం మరమ్మత్తులకే అయింది. ట్రస్టు పొలాల చుట్టూ కంచె వేశారు. స్కూలు బిల్డింగ్ పైకప్పుకి రిపేర్లు చేశారు. ట్రస్టు భవనాలకి రిపేర్ల పేరు చెప్పి, మౌన శత దినోత్సవ వేడుకల పేరు చెప్పి బాగానే ఖర్చు అయింది. అలానే సిబ్బంది జీతభత్యాలు పెరిగాయి. విద్య వైద్య సదుపాయాలు పేరు చెప్పి, రు. 2.19 కోట్ల వరకూ విరాళాలు వచ్చాయని ట్రస్టు తాజా నివేదికలో పేర్కొన్నారు. ఎమ్.పి.ఆర్‌లో, సి, డి, హాస్టళ్ళలో, ధర్మశాలలో, ఎమ్.పి.సిలో, భక్త జన సౌకర్యార్థం రూ.2.7 కోట్ల ఖర్చు అయింది గత ఆర్థిక సంవత్సరంలో. శుక్లాల ఆపరేషన్లు, పంటి ఆపరేషన్లు చేయటానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఆరంగాంలోని మెహెర్ హెల్త్ సెంటరులో మెరుగైన సదుపాయాలు కల్పించారు. నిరుపేదలకి ఉచిత వైద్య సేవలని అందిస్తున్నారు ఎప్పటిలానే. ***

# మెహెర్‌బాబా పత్రిక
# ముద్రణ, రవాణా ఖర్చులు

**పత్రిక ముద్రణ, రవాణా, నిర్వహణ ఖర్చులు అనూహ్యంగా పెరిగాయి. సుమారు** పదేళ్ళ క్రితం వరకూ జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై బ్యాంకు వడ్డీ 12 శాతం వరకూ వుండేది. ఆ కారణంగానే, వార్షిక చందా రూ. 100/-, జీవిత సభ్యత్వం రూ.1000/- నిర్ణయించాం. జీవిత సభ్యులు చెల్లించిన నగదుపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రికా నిర్వహణలో నేటికీ వినియోగిస్తున్నాం.

**నేడు బ్యాంకులు ఇస్తున్న వడ్డీ రేట్లలో గణనీయమైన మార్పు వచ్చింది. ఆ కారణంగా ఈ క్రింది నిర్ణయాలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రతిపాదించడమైంది. 1.వార్షిక సభ్యత్వం రూ. 150/-, 2.జీవిత సభ్యత్వం రూ.2,000/- గా మార్పు చేయడమైంది. ప్రస్తుతం వున్న జీవితసభ్యులు, అంటే ఇంతక్రితం వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లించిన వారు కూడా,** వీలున్న మేరకు, మా ప్రతిపాదనను మన్నించి అదనపు వెయ్యి రూపాయలు మీ వీలువెంబడి పత్రిక చిరునామాకు పంపవల్సిందిగా కోరుతున్నాం. **మా ఈ విజ్ఞప్తిని మన్నించి ఇప్పటికే చాలామంది అదనపు వెయ్యి రూపాయలు చొప్పున పంపుతున్నారు.** జీవిత సభ్యుల చెల్లింపుల వివరాలు ప్రతినెలా పేజి 40లో ప్రచురిస్తున్నాం. పాఠకులు గమనించగలరు. **మీ సహకారం కోరుతూ, మీ సూచనలు, సలహాలు మా వాట్సప్ నంబర్ 99595 53218 తెలియజేయగలరు.**

## స్మృతి పథంలో

## బాబా సన్నిధిలో శ్రీ జియస్ఎన్ మూర్తి గారి జ్ఞాపకాలు

**- శ్రీమతి మెహెర్ మాయ, భీమిలి**

**భీమిలి బాబా కేంద్ర ప్రేమికురాలు శ్రీమతి మెహెర్ మాయ బాబా ప్రేమికులందరికీ** చిరపరిచితురాలే. ఆమె శ్రీ జి.యస్.ఎన్. మూర్తి గారికి దగ్గర బంధువు (మేనకోడలు). ఆమె ఇటీవల మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధితో మాటామంతీగా "బాబా సన్నిధిలో శ్రీ జి.యస్.యన్. మూర్తి గారి జ్ఞాపకాల" గురించి నాలుగు అంశాలు చెప్పారు. ఆసక్తికరంగా వున్న ఆ విషయాలను ఇకపై ఆమె మాటల్లోనే చదువుకుందాం.

## నేనే ఆ శివయ్యను

**ఏ సంవత్సరమో గుర్తులేదు కానీ, ఆ వేళ మహా శివరాత్రి పర్వదినం. శ్రీ జి.యస్.యన్.** మెహెర్‌బాబా సమక్షంలో గురుప్రసాద్, పూణేలో వున్నారు. ఆయన బాబా పరిధిలోకి వచ్చిన తొలినాళ్ళవి. "బాబా మమ్మల్ని త్వరగా వదిలి పెడితే, శివరాత్రి కదా, దగ్గర్లో వున్న శివాలయానికి వెళ్ళి, స్వామి దర్శనం చేసుకుందామని అనుకున్నారట. ఈ ఆలోచన ఆయన మనస్సుని తొలిచేస్తోంది. బాబాకి ఎదురుగా కూర్చున్నా, ఆయన మనస్సులో ఈ ఆలోచనల దొంతరలు ఆగడం లేదు. ఐతే ఏమయ్యిందంటే, కొద్దిసేపటి తర్వాత ఎదురుగా ఆసీనుడైన అవతారుని స్థానంలో "అతిపెద్ద శివలింగం" దర్శనమయ్యింది. ఇలా ఒక్కసారి కాదు. కొన్ని క్షణాల వ్యవధిలోనే మూడుసార్లు పరమ శివుని దర్శన భాగ్యం లభించింది. శ్రీ జియస్‌యన్ నిరుత్తరుడయ్యారట. ఆ ఆశ్చర్యం నుండి తేరుకునే లోపల, **"నీవు ఆరాధించే శివయ్యను నేనే"** అని బాబా సంజ్ఞలతో చెబుతుంటే, మౌనావతారునికి వినమ్రతతో ప్రణమిల్లానని, శ్రీ గుమ్మలూరి మాతో చెప్పారు.

## నాలుగు బనీన్లు

**1992 అక్టోబరు మాసం. ఆ ఏడాది భీమిలి బాబా కేంద్ర వార్షికోత్సవం సందర్భంగా** ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేశాం. శ్రీ జియస్ఎన్ మూర్తి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాబా సహవాస్ పూర్తయ్యాక కూడా ఆయన ఒక పది రోజులు మా కేంద్రంలోనే వున్నారు. ఒకరోజున ఆయన స్నానం చేసి బనీనుతో కూర్చుని మాతో మాటా మంతీగా మాట్లాడుతున్నారు. ఆయన ధరించిన బనీనుపై నా దృష్టి పడింది.

ఆ బనీను చాలా చోట్ల చిరిగి వుంది. నాలుగైదు పెద్ద కన్నాలు కూడా కనిపించాయి. దాంతో నేను ధైర్యం చేసి, మామయ్యా, నీ బనీను సైజు చెప్పు. కొత్తవి నాలుగు తెప్పిస్తానన్నాను. ఆయన ఒప్పుకోలేదు. నాకు అవసరం లేదని కొట్టిపారేశారు. అలాంటి ప్రయత్నం వద్దని వారిస్తూ, “బాబా ఇస్తాడులే” అన్నారు. నాకేం కావాలో బాబాకి బాగా తెలుసు అన్నారు. నేను ఏమీ మాట్లాడలేక పోయాను.

**ఆ తర్వాత ఆశ్చర్యం కలిగించింది ఏమంటే, ఆ రోజు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో** విశాఖపట్నం నుండి బాబా ప్రేమికులు శ్రీ టి. ఎన్. రథో గారు, ఆయనతోపాటు మరో నలుగురు శ్రీ జియస్‌యన్ గారిని కలవడం కోసం మా ఇంటికి వచ్చారు. శ్రీ రథో గారు వస్తూ తన చేతిలో వున్న నాలుగు కొత్త బనీన్లు వున్న ప్యాకెట్‌ని శ్రీ జియస్‌యన్ చేతిలో పెట్టారు. శ్రీ జియస్‌యన్ నాకేసి నవ్వుతూ చూశారు. దివ్యావతారుడు ఇలా చిన్న విషయాల్ని కూడా చాలా నిశితంగా పరిశీలిస్తారన్నట్లు వుంది ఆనాటి వారి చిరునవ్వు.

## ఆకాశంలో నక్షత్రాలు

**భీమ్లీ సెంటర్‌లో ప్రతివారం నిర్వహించే సత్సంగ్‌లకి పట్టుమని పదిమంది భక్తులు రావడం** లేదని నేను జియస్‌యన్ మూర్తి గారితో ఒక సందర్భంలో అన్నాను. ఆయన నాకేసి చూసి, ఆకాశంలోని నక్షత్రాలను ఊహించుకుని, ఒక్క క్షణం ధ్యాన ముద్రలో కళ్ళు మూసుకుని కూర్చోమన్నారు. అలా కళ్ళు మూసుకుంటే ఎన్ని నక్షత్రాలు కనపడు తున్నాయో, వారందరూ బాబా ప్రేమికులే అన్నారు. బెంగ వద్దని భరోసా పలికారు.

## అవతారుని చమత్కారం

**మెహెర్‌బాబా డెహ్రాడూన్‌లో వున్న సమయమది. హమీర్‌పూర్ నుండి వచ్చిన పుకార్‌జీ,** కృష్ణ నాయర్, డాక్టర్ డాంకిన్ మరో ఇద్దరితో కలిసి శ్రీ జియస్‌యన్ తదితరులు బాబా సమక్షంలో వున్నారు. ముందుగా బాబా పుకార్‌జీని పిలిచి, నీవు నన్నెంతగా ప్రేమిస్తున్నావ్ అని ప్రశ్నించారు. నా ఆదేశాలను విధేయతతో పాటించగలవా? అని ప్రశ్నించారు. ఏమాత్రం ఆలోచించకుండా నూటికి నూరు శాతం పాటిస్తాను బాబా అని జవాబిచ్చాడు పుకార్ జీ. దూన్ నగరంలో నిన్ను నగ్నంగా తిరిగి రమ్మనమని ఆదేశిస్తే ఏం చేస్తావ్ అని అడిగారు. క్షణకాలం ఆలస్యం చేయక పుకార్ అందుకు సిద్ధమై బాబా మనస్సు దోచుకున్నాడని శ్రీ జియస్‌యన్ చెప్పారు.

**ఆ పిదప, శ్రీ జియస్‌యన్ వంతు వచ్చింది. నీవు నన్నెంతగా ప్రేమిస్తున్నావ్? అని ప్రశ్నించారు.** జియస్‌యన్ తడుము కోకుండా మాటల్లో చెప్పలేనంత అని చేతులు చాచి

అభినయించారు. దాంతో బాబా ఆయన్ని తన దగ్గరకి తీసుకుని బిగి కౌగిలి ఇచ్చారు. ప్రక్కటెముకలు విరిగిపోయేటంత గట్టి కౌగిలితో తనని బాబా బంధించారని జియస్‌యన్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ప్రధానం. పాఠకులు జాగ్రత్తగా గమనించాలి.

**శ్రీ జియస్‌యన్ గార్ని తిన్నగా ఆయన స్వగ్రామం ఖరగ్‌పూర్‌కి వెళ్ళమని బాబా ఆదేశించారు.** తిన్నగా ఇంటికి వెళ్ళి తానిచ్చిన ఆలింగనాన్ని తన భార్యకు ఇవ్వమన్నారు. అంతేకాదు మార్గమధ్యంలో ఎవరినీ తాకవద్దన్నారు. ఎవరికీ ఆలింగనం ఇవ్వొద్దని ఆదేశించారు బాబా. జియస్‌యన్ అంటే జగమెరిగిన బ్రాహ్మణుడు కదా. బాబా ప్రేమికులందరూ ఆయనకు సన్నిహిత స్నేహితులే. సాధారణంగా బాబా ప్రేమికులు ఆయన్ని చూస్తూనే ఆయన అలింగనం కోసం చేతులు చాచుతారు. ఎలాగో వీరందరి నుండి తెలివిగా తప్పించుకుని ఖరగ్‌పూర్‌కి చేరుకున్నారు. ఇంటి నిండా బంధువర్గం వుంది. ఆయన తల్లితండ్రులూ, అన్నదమ్ములూ వున్నారు. వీరందరి నుండి తప్పించుకుని, ఆయన గారి భార్య సావిత్రమ్మకి బాబావారిచ్చిన ఆదేశాలను నిష్టగా అమలుచేశారు.

**ఈ సంఘటన జరిగిన తర్వాత శ్రీమతి సావిత్రమ్మ గర్భవతి అయ్యింది. అది 1965వ** సంవత్సరం. ఏప్రిల్ ఒకటో తేదీన సిజేరియన్ జరపాల్సివస్తుందని డాక్టర్లు అన్నారు. ఏప్రిల్ 1వ తేది..ఆల్ ఫూల్స్ డే...ఈ తేదీ జియస్‌యన్ గారికి ఎందుకో నచ్చలేదు. ఈ తేదీని ఎలాగైనా తప్పించాలని బాబాని మనస్సులోనే వేడుకున్నారట. ఖరగ్‌పూర్‌లో ఏప్రిల్ 1వ తేదీన పెద్దవాన – వరదలూ వచ్చి, నగరంలో ఎక్కడా కరెంటు లేక, జరపాల్సిన ఆపరేషన్ వాయిదా వేశారు. ఆ మాదిరిగా బాబా తనను కరుణించాడన్నారు. ఆ మర్నాడు 1965 ఏప్రిల్ 2న పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది మా సావిత్రత్త. ఆ పాపకు బాబావారు స్వయంగా మెహెరా అని పేరుపెట్టారు. ఆ పిదప, మరో ఇద్దరు మగ పిల్లలకు తండ్రి అయ్యారు శ్రీ జియస్‌ఎన్.

**అశ్చర్యం కలిగించే విషయం ఏమంటే, శ్రీ జియస్‌ఎన్ – సావిత్రి గారికి పెళ్ళై అప్పటికి 25 సంవత్సరాలు పైబడింది. ఐనప్పటికీ సంతానం లేదు. ఎందరో స్పెషలిస్టులను** సంప్రదించారు. ఆమెకు పిల్లలు పుట్టడం కష్టం అని వైద్యులు తేల్చి చెప్పారు. ఆమెకు గర్భాశయమే లేదని స్పష్టం చేశారు. ఆపై దంపతులిద్దరూ సంతానం విషయమై ఆశ వదులుకున్నారు. దగ్గర బంధువుల పిల్లల్ని ఎవరినైనా పెంచుకుందామనుకున్నారు.

శ్రీ జియస్‌యన్ గారి జీవితం అంతా అవతారుని కనుసన్నలలో జరిగింది. అవతారుని చమత్కారాలు ఆయన జీవితంలో అడుగడుగునా ఎన్నో చవిచూశారు. పలు సందర్భాలలో జరిగిన అనేక స్వీయ అనుభవాలు –అనుభూతుల్ని శ్రీ జియస్‌యన్ గ్రంథస్తం చేశారు. అచ్చులో లభించని ఇలాంటి సంఘటనలు ఇంకా ఇలా ఎన్నో వున్నాయి.

# చనిపోయాక ఏమవుతుంది?

**చనిపోయాక ఏమవుతుంది? ఇది ఓ చిక్కు ప్రశ్న, అంతుచిక్కని ప్రశ్న. ఈ ప్రశ్నకి బాబానే** స్వయంగా జవాబు ఇచ్చారు. సంస్కారాలు పూర్తిగా ఖర్చు అయిపోయిన తర్వాతనే చావు వస్తుంది. స్థూల శరీరం విడిచి పెట్టాక, సంస్కారాలు మనస్సులో సూక్ష్మ శరీరంలో వుంటాయి. మనిషి కన్నుమూశాక మనస్సుకి స్థూల శరీరానికి గల సంబంధాన్ని సంస్కారాలు తెగతెంపులు చేస్తాయి. అప్పుడేమవుతుంది? జీవితంలో జరిగిన అన్ని సంఘటనలని మనిషి మరిచిపోతాడు. పార్థివ శరీరం వుంచిన చోటనే సుమారు 40-70 గంటల సేపు మన సంస్కారాలు తచ్చాట్లాడుతూ వుంటాయి. ఆ తర్వాత అంటే 40-70 గంటల తర్వాత, ఆ జాగాతో చనిపోయిన వ్యక్తికి ఏమీ అనుబంధం వుండదు. తెగిపోతుందా బంధం. ఇహపోతే, చనిపోయిన తర్వాత ఎనిమిది, పది రోజులు వరకూ సూక్ష్మ రూపంలో ఆత్మ స్వర్గ సుఖాలను చవిచూడవచ్చు. నరకయాతన పడినా పడవచ్చు. అది అంతా సంస్కారాలని బట్టి వుంటుంది. చనిపోయిన వ్యక్తి ఆత్మ శాంతి కోసమంటూ, కర్మ చేస్తారు చాలామంది. ఇదంతా వట్టి దండగ పని. పదవరోజు తర్వాత ఏ కర్మ చేయనక్కరలేదు. ఐతే, కుక్కలకి, కాకులకి ఏదైనా పెడితే మంచిదే. శవం దగ్గరగా తిరుగుతున్న కుక్కలు, ఎగురుతున్న కాకులు తినటానికి ఏదైనా పెట్టితే చాలు. అది మంచి కర్మ అనాలి. ఎందుకనీ? ఎందుకంటే, అవి తమ సూక్ష్మ దృష్టితో చనిపోయిన వ్యక్తి ఆత్మని చూడగలుగుతున్నాయి. కుక్కలకి, కాకులకి సూక్ష్మ చైతన్యం లేదు. ఐతేనేం వాటికున్న శక్తివల్ల చనిపోయిన వ్యక్తి సంస్కారాలని అవి తమ వైపుకి త్రిప్పుకొంటాయని బాబా మండలి వారికి వివరించారు. **మెహెరీశం 1 పేజి. 109.**

# మూర్తి గారు ధన్యుడు

**నిత్య జీవితంలో వచ్చీపోయే అనేక ఒడిదుడుకులు గురించి ప్రస్తావిస్తూ శ్రీ జియస్ఎన్ మూర్తి ఇలా** అన్నారు. సముద్రపు ఒడ్డున నిల్చుంటే పెద్ద అలలు ఉధృతంగా వస్తాయి. మన కాళ్ళను తాకి, నెమ్మదిగా వెనక్కి పోతాయి. అలాగే, మన జీవితంలో వచ్చే కష్ట - సుఖాలు కూడా వస్తూ పోతుంటాయని హితవు చెప్పారు ఓ సందర్భంలో..

**డెహ్రాడూన్‌లో బాబా సమక్షంలో వున్న సమయమది.** ఆ రోజు ఏమయ్యిందంటే, “నీకూ - నాకూ మధ్య పెద్ద సంస్కారాల బంధం అడ్డుగా నిలుస్తోందన్నారు” బాబా. దాన్నుండి ఏదో చెడు వాసన కూడా వస్తోందన్నారు. ఇది గమనించిన మూర్తి గారు తన శరీరంపై వున్న జంధ్యాన్ని తీసి పారేశారు. ఆపై బాబా గాఢ ఆలింగనం ఇచ్చారు.

# కోఠి బాబా కేంద్ర 52వ వార్షికోత్సవం

(శ్రీ వేల్పుల జీవన్ ప్రసాద్, హైదరాబాద్)




**2026 జూలై 29న కోఠి బాబా కేంద్ర 53వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా శ్రీ గోపి, శ్రీ మెహెర్ తేజ అవతారుని నామ్-ధున్ నిర్వహించారు.** స్థానిక బాబా ప్రేమికులు అవతారుని భజన గీతాలను చక్కగా ఆలాపించారు. కుమారి కృత్తిక మెహెర్ ప్రదర్శించిన నృత్యాభినయం ఆహుతుల్ని అలరించింది. ఆ పిదప, **"హృదయ స్పందన"** పేరిట ఒక వాస్తవ సంఘటన ఆధారంగా చక్కని లఘు నాటిక ప్రదర్శించారు. శ్రీ ఎన్.వి.వి. సత్యనారాయణ గారు మెహెర్‌బాబా సన్నిధిలో జరిగిన హాస్య సన్నివేశాలు వివరించారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బి. రామకృష్ణయ్య తనదైన శైలిలో సహవాస్‌ని చక్కగా నిర్వహించారు. శ్రీ నోరి సూర్యనారాయణ కోఠి సెంటర్ ఆవిర్భావం గురించి క్లుప్తంగా వివరించారు. బాబా స్వయంగా ఇచ్చిన ఆదేశాలతో, 1960లో బాబా కేంద్రాన్ని తమ తండ్రి శ్రీ నోరి ప్రకాశరావు సికింద్రాబాద్‌లో ప్రారంభించారని అన్నారు. "మా నాన్న గారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా అహమ్మద్‌నగర్ నుండి సికింద్రాబాద్‌కి బదిలీపై వస్తున్న సమయంలో, మా అమ్మ బాబా నుండి దూరంగా వెళ్ళిపోతున్నామని బాధపడుతుంటే, "మీరు ఎక్కడ ఉంటే అక్కడ నా నామవ్యాప్తి చెయ్యమని బాబా చెప్పారన్నారు." ఆ మేరకు సికింద్రాబాద్‌లో ముందుగా పాట్నీ దగ్గర, ఆ తర్వాత మడ్‌ఫోర్ట్‌లోని గవర్నమెంటు క్వార్టర్స్‌లో 13 సంవత్సరాలు బాబా కేంద్రాన్ని నిర్వహించామన్నారు. **కాగా, 1973 నుండి ఈసామియా బజార్‌లో వున్న కోఠిలో బాబా కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు.** *

సందర్శనీయం

# బెట్ - ఖేడ్గాంలో సద్గురు నారాయణ్ మహారాజ్ ఆశ్రమం



**సద్గురు నారాయణ్ మహారాజ్‌ని పంచ సద్గురువులలో ఒకరని మెహెర్‌బాబా ప్రకటించారు. నారాయణ మహారాజ్ గారి ఆశ్రమం** బెట్- ఖేడ్గాం అనే చిన్న గ్రామంలో వుంది. ఇది మెహెరాబాద్ నుండి పూణే వయా డోండ్ వెళ్ళే రాష్ట్ర రహదారిలో మెహెరాబాద్ నుండి సుమారు 90 కిమి దూరంలో వుంది. మేం కొంతమందిమి మెహెరాబాద్ నుండి నారాయణ్ మహారాజ్ ఆశ్రమాన్ని చూడ్డానికి ఆగస్టు 2, ఆదివారంనాడు వెళ్ళాం. ఇక్కడ మహారాజ్ దర్శనం ఇచ్చిన ప్రాంగణం, ఆయన ఉపయోగించిన వెండి సింహాసనం, దత్తాత్రేయుని దేవాలయం, శివాలయం, ధర్మశాల, ధ్యాన కేంద్రం, ఇతరత్రా సందర్శించాం.

**సద్గురు నారాయణ మహారాజ్ మన దేశంలోని అనేక పుణ్యక్షేత్రాలు - వారణాసి, కేధార్‌నాథ్, బదరీనాథ్, రామేశ్వరం, మధురై,** తిరుపతి, కలకత్తాలోని రామకృష్ణ ఆశ్రమం, ఇలా పలు పవిత్ర ప్రదేశాలను సందర్శించి చివరిగా ఖేడ్గాంలో 8 ఎకరాల విస్తీర్ణంలో తన ఆశ్రమాన్ని నెలకొల్పారు. ఈ ప్రాంతాన్ని బెట్ - ఖేడ్గాం అని పిలుస్తారు. మరాఠీలో బెట్ అంటే ఒక చక్కని ద్వీపం (చుట్టూతా నీరు గల ప్రాంతం) అని అర్థం. ఆ రోజుల్లో ఖేడ్గాం చుట్టుప్రక్కల నీటిపారుదల కెనాల్స్ ఎక్కువగా వుండేవట.

**మెహెర్‌బాబా 1915 ఏప్రిల్‌లో పూణే నుండి కర్నాటకలోని రాయచూర్ పట్టణానికి రైల్లో వెళ్ళాలని టిక్కెట్ తీసుకుని, మార్గమధ్యంలో వున్న** ఖేడ్గాంలో దిగి, నారాయణ్ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించారని మెహెరీశం తెలియజేస్తోంది. ఆ సమయంలో మహారాజ్

సువర్ణ ఖచిత కిరీటం ధరించి, వెండి సింహాసనంపై కూర్చుని, వందలాది భక్తులకు దర్శన కార్యక్రమంలో వున్నారు. మహారాజ్, మేర్వాన్‌ని చూస్తూనే, తన రజిత సింహాసనం నుండి లేచి, మేర్వాన్‌కి ఎదురువచ్చి, మేర్వాన్‌ని ప్రేమగా తనతో తీసుకెళ్ళి తన సింహాసనంపై కూర్చోబెట్టారని, నారాయణ మహారాజ్ ఆశ్రమ భోగట్టా. అంతేకాదు, మహారాజ్ తన మెడలోని పూలహారాన్ని మేర్వాన్ మెడలో వేసి, మామిడి పళ్ళ రసంతో సాదరంగా ఆహ్వానించారు. ఆ పిదప వారిద్దరూ కొద్దిసేపు ఆధ్యాత్మిక విషయాల్లో నిమగ్నమయ్యారు. నేడు నారాయణ మహారాజ్ ఆశ్రమంలో పలుచోట్ల మెహెర్‌బాబా చిత్రపటాలు మాకు కనిపించాయి. అలాగే స్థానిక పెద్దలు, బాబా ప్రేమికుల్ని సాదరంగా ఆశ్రమానికి ఆహ్వానించి పలు దర్శనీయ ప్రదేశాలను చూపించారు.

**మెహెర్‌బాబా ప్రేమికుడైన నాగపూర్ నివాసి, రామచంద్ర పంకరాజ్‌కి సంబంధించి చిన్న కథనం మెహెరీశంలో క్లుప్తంగా ఇలా వుంది. నాగపూర్‌కి** సమీపంలోని **కాంప్టే** అనే ప్రాంతంలో స్థానిక దేవాలయంలో మహారాజ్ దర్శనం ఇస్తున్నారు. మహారాజ్ అలంకార ప్రియుడని చెప్పాలి. ఆయన చేతి వేళ్ళకు బంగారు వుంగరాలు, పట్టు పీతాంబరాలతో ధగధగలాడుతున్నారు. అలా సద్గురువుని చూసి, పంక్‌రాజ్ వుండబట్టలేక నాలిక కరుచుకున్నాడు. మహారాజ్‌కి పట్టువస్త్రాలు అవసరమా? అని వ్యాఖ్యానించాడు. ఆ తర్వాత చాలా సంవత్సరాలకు పంక్‌రాజ్ మెహెర్‌బాబా గురించి తెలుసుకుని తొలిసారిగా బాబావారిని దర్శించుకునేందుకు అహమ్మద్‌నగర్ వచ్చాడు. ఆ సమయంలో బాబా అతనికి దర్శనం నిరాకరించడమే కాకుండా, అతడ్ని ముందుగా ఖేడ్గాం వెళ్లి నారాయణ మహారాజ్ ఆశ్రమాన్ని సందర్శించమన్నారు. నారాయణ్ మహారాజ్ పంచ సద్గురువులలో ఒకరని చెప్పమన్నారు బాబా. పంక్‌రాజ్ తెలివైనవాడు కాబట్టి, తన తప్పుని తక్షణం తెలుసుకున్నాడు. ఆ దరిమిలా తన తప్పుని క్షమించమని వేడుకుని మెహెర్ ప్రేమికునిగా బాబా సేవలో తరించాడు.

**1910 - 1945 నడుమ బెట్ - ఖేడ్గాంలో నారాయణ మహారాజ్ ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.** ఆ దరిమిలా 1945 ఆగస్టులో మహారాజ్ బెంగళూరు వెళ్ళారు. బెంగళూరులో పెద్ద ఎత్తున పలు యాగాలు, హోమాలు మూడు వారాలపాటు నిర్వహించారు. ఆ క్రతువుకి వేలాది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిశాక, 1945 సెప్టెంబరు 3న మహారాజ్ దేహత్యాగం చేశారు. మహారాజ్ దేహాన్ని ఖేడ్గాం పంపేందుకు మైసూర్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. ఐతే బెంగళూరులో వున్న మహారాజ్ అనుయాయులు అందుకు అంగీకరించలేదు. బెంగళూరులోని కెంపె గౌడా నగర్‌లో నారాయణ్ మహారాజ్ సమాధి వుంది. బెట్ ఖేడ్గాం మహారాజ్ కార్యస్థానం. వీలుచిక్కితే, ఖేడ్గాంని ఒకసారి దర్శించాలనుకోవడం ముదావహం! ***

# విశాఖపట్నం మెహెర్ నిలయం 55వ వార్షికోత్సవం



**విశాఖపట్నం మెహెర్ నిలయం 55వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రేమిక** సహవాస్ 2026 ఆగస్టు 2న వైభవంగా జరిగిందని కార్యదర్శి శ్రీ ఎన్.వి.యస్. రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కేంద్ర అధ్యక్షులు శ్రీ డి. మెహెర్‌బాబా సప్తవర్ణ పతాకావిష్కరణ చేశారు. ఆ పిదప, రాజేష్ పాండే, డెప్యూటి జనరల్ మేనేజర్, హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్, ప్రొఫెసర్ బి. కేశవరావు విజయవాడ, శ్రీమతి పి. పావని, సంయుక్త కార్యదర్శి అవతారుని సందేశాలపై ప్రసంగించారు.
స్థానిక తాటిచెట్లపాలెం కేంద్ర చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకర్షించింది.



## బాబాలో ఐక్యం

**శ్రీ వడ్ల గంగారాం, కంకల్ బాబా కేంద్ర ప్రేమికులు** 2026 జూలై 19న బాబా నామస్మరణతో తుదిశ్వాస విడిచారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన స్థానిక బాబా కేంద్ర కార్యక్రమాలలో చురుకుగా పాలొంటున్నారు. శ్రీ గంగారాం గారి ఆత్మకు శాంతి కలిగించాలని బాబావారిని మౌనంగా ప్రార్థించినట్లు తెలిపారు.

# గాజువాక కేంద్రంలో




**గాజువాక బాబా కేంద్రంలో 2026 జూలై 19 సాయంత్రం ఏర్పాటు చేసిన సత్సంగ్ కార్యక్రమంలో** ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ బి. క్రిష్ణయ్య, హైదరాబాద్ అవతారుని జీవిత చరిత్రపై ప్రసంగిస్తూ, బాబా చెప్పిన అనేక అరుదైన ఆధ్యాత్మిక విషయాలను ఉటంకించారు. శ్రీ మెహెర్ దినేష్, శ్రీకాకుళం భజన గీతాలను ఆలాపించారు. జూలై 31న ఏర్పాటు చేసిన సత్సంగ్‌లో శ్రీ సంజయె దుబే, లక్నో ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఆగస్టు 2న జరిగిన ప్రత్యేక సత్సంగ్‌లో డాక్టర్ బి. కేశవరావు, విజయవాడ బాబావారి సందేశాలపై వివరణాత్మక ప్రసంగం చేశారు.

**కాగా, జూలై 19 ఉదయం అవతార్ మెహెర్‌బాబా వైజాగ్ సిటీ సెంటర్ 10వ వార్షికోత్సవం** సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రేమిక సహవాస్‌లో శ్రీ క్రిష్ణయ్య బాబా సందేశాలపై విశేష ప్రసంగం చేశారు.

# బాబా విగ్రహావిష్కరణ 31వ వార్షికోత్సవం

**అవతార్ మెహెర్‌బాబా విగ్రహావిష్కరణ 31వ వార్షికోత్సవం సందర్భంగా నరసరావుపేట కేంద్రంలో** 2026 ఆగస్టు 10వ తేదీన ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ వంకాయల అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర సెంటర్ కార్యదర్శి శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, మచిలీపట్నం, శ్రీమతి శ్యామల ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని శ్రీ అచ్యుతరావ్ తెలిపారు.




# క్రొత్త పుస్తకం

ఈ పుస్తకంలో అవతారునికి తమ సర్వస్వం అర్పించి ఆయన పాదాల చెంత తరించిన తొలితరం బాబా మండలిసభ్యుల జీవిత రేఖా చిత్రాలను సాధికారికంగా తెలియజేసే చిన్ని ప్రయత్నం చేశాం. అవతారుని సన్నిహిత మండలి సభ్యుల జాబితా అనంతం. ఐతే, చిరు పొత్తంలో కేవలం 55 మంది మండలిని మాత్రమే ఎంపిక చేసుకున్నాం. వీరందరూ చిరంజీవులు.

వీరి సమాధులు మెహెరాబాద్‌లో వున్నాయి. ఎగువ మెహెరాబాద్‌లో స్త్రీ మండలి సభ్యులు, దిగువ మెహెరాబాద్‌లో పురుష మండలి సభ్యుల సమాధులు వున్నాయి. ఆ వివరాలు ఇలా వున్నాయి:

## స్త్రీ మండలి సభ్యులు:

1. గుల్మాయి 2. దౌలతా మాయి 3. సూనామాసి 4. మెహెరా మాయి 5. మణిజా 6. నాజా 7.ఖోర్షేద్ 8. డాక్టర్ గోహెర్ 9. కేటి 10. మెహెరూ 11.మన్సారీ మాయి 12. కిట్టీ దేవి 13. రానో గెల్లీ 14. నానీ గెల్లీ 15. ఆర్నవాజ్ 16. నోరినా 17. ఎలిజెబెత్ 18. నాడినే 19. మార్గెట్ క్రాస్కీ 20. మిలిడ్రెడ్ కైలి 21. కైకోబాద్ కుమార్తె

## దిగువ మెహెరాబాద్‌లో :

22. మహమ్మద్ మస్తు 23. ఆలీషా 24. మాసాజీ 25. గుస్తాద్‌జీ 26. కాకా బారియా 27. కైకోబాద్ 28. ఛాన్జీ 29. బైదుల్ 30. ప్లీడర్ 31. సరోష్ 32. ఆదీ.కె. ఇరానీ (సీ) 33. పెండూ 34. పాద్రీ 35. విష్ణు మాస్టర్ 36. ఛగన్ 37. డాక్టర్ నీలూ 38. రామచంద్ర గాడేకర్ 39. మెహెర్‌జీ కర్కారియా 40. ఏరుచ్ జెస్సావాలా 41. అలోబా జీ 42. కుర్షేద్ తలాతి 43. సిద్దూ 44. భావూ కల్చూరి 45.డాంకిన్ 46. డాక్టర్ హారీకెన్‌మోర్ 47. నారిమన్ 48. ఆదీ జూనియర్ 49. ఫ్రెరం వర్కింగ్ బాక్స్‌వాలా 50. జంగ్లే మాస్టర్ 51. ఆలీ రమ్జూ 52. మెహెర్వాన్ 53. బాలనాటు **54. ఫ్రెడ్ మార్క్స్ 55) చతుష్పాదులు - 1) చుమ్ 2). కిప్పీ 3). క్రాకర్ 4). ఫౌండీ 5). వారియర్ 6) మోతీ 7). పీటర్ 8). రమ్మూ (మెహెరాజాద్‌లో).**

**మీ స్పందన తెలియజేయగలరు. వాట్సప్ - డాక్టర్ మల్లాది కృష్ణానంద్, 9959553218.**

# మా ప్రచురణలు




























**ప్రతులకు ఫోన్ : 99595 53218 సంప్రదించగలరు**

చిత్రమాలిక

## జూబ్లీ బాబా కేంద్రంలో బాలల సహవాస్, 2026 జూలై 26








ఫోటోలు పంపినవారు – శ్రీ నోరి మెహెర్‌చంద్, హైదరాబాద్

## జీవిత సభ్యత్వం

### 2026 జూలై - ఆగస్టు నెలలలో పంపిన వారి వివరాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీమతి షిరీన్‌భాను మెహెరా అడవల్లి, హనుమకొండ | రూ. 1000/- |
| 2. | శ్రీ చల్లా సోమశేఖర రెడ్డి, భీమవరం | రూ. 1000/- |
| 3. | శ్రీ పి. హరినాథ్ గుప్త, కదిరి | రూ. 1000/- |
| 4. | శ్రీ బెజవాడ వెంకటేశ్వర రెడ్డి, కోదాడ | రూ. 1000/- |
| 5. | శాఖా గ్రంథాలయం, కోదాడ | రూ. 1000/- |
| 6. | శాఖా గ్రంథాలయం, మొగలాయికోట, కోదాడ | రూ. 1000/- |
| 7. | శ్రీ బెజవాడ నాగిరెడ్డి, శాఖా గ్రంథాలయం, చిలుకూరు | రూ. 1000/- |
| 8. | శ్రీమతి బెజవాడ కరుణ, **Z.P. HIGH SCHOOL,** గుదిబండ | రూ. 1000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 2000/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 150/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు** శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,** యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087. **ఫోన్: 99595-53218.**

**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Caxton Printers, Lakdi-ka -Pul, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/07310, Posted at Patrika Channel, Nampally, Hyderabad.**